జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

కృష్ణ | సోమవారం 1 జూన్ 2026 | సంపుటి : 01 | సంచిక : 158 | పేజీలు : 12 | వెల : 4/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



# తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టిస్తున్న వాతావరణం

ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ రాష్ట్ర ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరనుంది. రాష్ట్రంలోని 119 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 155 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 నుంచి 46 డిగ్రీల వరకు నమోదయ్యే ప్రమాదం ఉంది. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గరిష్టంగా 43 నుంచి 44 డిగ్రీల తీవ్రతతో ఎండలు మండిపోనున్నాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల వాతావరణం చల్లబడనుంది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు

# సాగునీరు విడుదల


- హర్షం వ్యక్తం చేసిన రైతులు
- ఇరిగేషన్‌పై ప్రభుత్వం నిర్ణయాలు రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్న మంత్రి కందుల దుర్గేశ్
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల
- గోదావరికి జలహారతి ఇచ్చి బటన్ నొక్కి నీరు విడుదల

హైదరాబాద్

నీటిపారుదల వ్యవస్థపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేశ్ ఈ సందర్భంగా వెల్లడించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల మేలును కోరే ప్రభుత్వమని ప్రస్తావించారు. మంత్రి కందుల దుర్గేశ్?తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఆపై గోదావరికి జలహారతి ఇచ్చి మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు ఎంతగానో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుపానులు, ప్రకృతి - మిగతా3లో

# త్వరలోనే చేతికి సొంతింటి తాళాలు

- లబ్ధిదారులకు గుడ్ న్యూస్.. సర్కార్ గ్రీన్ సిగ్నల్!
- చాలా కాలంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మంది లబ్ధిదారులకు ఈ నిర్ణయం వల్ల నేరుగా ప్రయోజనం చేకూరనుంది
- నిధుల విడుదలతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది
- గృహాల నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో, అతి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను హ్యాండోవర్ చేసేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు



హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు, ఆయా హౌసింగ్ సముదాయాలలో అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.273.79 కోట్ల నిధులను విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ టిడ్కో హౌసింగ్ - మిగతా3లో



## తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

- సీబీఎస్‌ఈ వివాదంపై కాంగ్రెస్ ధ్వజం
- కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు
- మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారన్న హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి

- మే 30తో ముగిసిన జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం
- ఆయన స్థానంలో సీడీఎస్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన రాజా సుబ్రమణి
- సాయుధ బలగాల్లో స్వదేశీ ఆయుధాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని వెల్లడి

## జెన్ జీ కోసం 'సేనాగళం' పేరిట

# ప్రత్యేక కమిటీలు

- ప్రకటించిన పవన్ కల్యాణ్
- జెన్‌జీ గళాన్ని వినిపించడమే 'సేనాగళం' లక్ష్యమని వెల్లడించిన పవన్
- కులం పేరుతో తిట్టే ధోరణి పోవాలని వెల్లడించిన జనసేనాని
- సామాజిక బాధ్యతతో జనసేన పార్టీ ముందుకు వెళ్తుందని వివరణ



అమరావతి

జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, నియోజకవర్గాల వారీగా సంస్థాగతంగా అభివృద్ధికి, జెన్ జీ గళం వినిపించేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 'సేనాగళం' పేరిట ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన సేనాగళం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ ప్రకటించడం విశేషం. పవన్ కల్యాణ్: అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ జెన్ జీ గళం వినిపించడమే సేనాగళం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆపై సేనాగళం కమిటీకి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దేశసమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ - మిగతా3లో



# ఎండలున్నాయ్ జాగ్రత్త

- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి'.. ప్రజలకు మోదీ మరోసారి సూచనలు
- ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్
- ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ
- మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని
- ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి
- చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం
- అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

# ఎండలున్నాయ్ జాగ్రత్త




మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వాహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్వీందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్వీదర్, అనిమేష్ పరుగు పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు.

"కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది." ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. "రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది" అని మోదీ అన్నారు.

**మన్ కీ బాత్ స్ఫూర్తితో సైనికులకు విరాళం**

మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు" అని మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. "దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

# తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా



సీబీఎస్‌ఈ మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగిన విద్యార్థులు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారని విమర్శించింది. విద్యార్థులు ధైర్యవంతులైన యువ భారతీయులని కొనియాడింది. మోదీ సర్కార్‌ను ప్రశ్నించిన విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు అర్హులని అభిప్రాయపడింది. వారు మంచి భవిష్యత్తును పొందేలా తాము చూస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కొంతమంది విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేశారు. గాంధీ ఈ వీడియో క్లిప్‌ను తన తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో జరిపిన అసలు విషయాలు బయటపెట్టే సంభాషణగా అభివర్ణించారు.

**'స్టూడెంట్స్ అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు'**

"వేదాంత్, అతని స్నేహితులు తెలివైన, ధైర్యవంతులైన భారతీయ యువకులు. వారు సీబీఎస్‌ఈ, మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. కానీ సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు. ఆ స్టూడెంట్స్ ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అర్హులు. ఆ భవిష్యత్తును పొందేలా మేము చూస్తాం. విద్యార్థులు తమ జవాబు పత్రాలను అడిగారు అంతే. దీంతో స్టూటెండ్స్ కాస్త అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు. సమస్యను అంగీకరించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. అందుకు బదులుగా పేద విద్యార్థులను నిందిస్తోంది. డీప్ స్టేట్, గూఢాచారులు, ఉగ్రవాదులు అని ముద్ర వేస్తోంది." అని విద్యార్థులతో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్థానీలు అని విద్యార్థులపై ముద్ర వేస్తున్నారు : ఖర్గే**

మరోవైపు, సీబీఎస్‌ఈ వివాదంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆందోళనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థుల మాట వినకుండా, వారిపై 'డీప్ స్టేట్ ఏజెంట్లు', 'పాకిస్తానీలు' అని ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా రంగంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా సీబీఎస్‌ఈ విద్యార్థులు, నీట్ అభ్యర్థులు ఇద్దరూ బాధితులుగా మారారని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విద్యా సంస్థలు, ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని సర్కార్ హయాంలో పతనాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. నిరసన తెలిపే, సమస్యలను లేవత్తిన యువత గొంతులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలతో యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. దేశ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో బీజేపీ విఫలమైందని, నియామక పరీక్షలను తప్పుగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

"విద్యార్థులు పరీక్షా యోధులుగా నిలవడానికి ఎగ్జామ్‌కు బయలుదేరారు. కానీ అందుకు బదులుగా వారిపై డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్తానీలు అని ముద్ర వేశారు. సీబీఎస్‌ఈ విద్యార్థులదైనా, నీట్ ఆశావహులదైనా అదే పరిస్థితి. మోదీ ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోంది. దేశ యువతను తమ అవినీతి వలలో చిక్కుకునేలా చేసింది. ఒకప్పుడు ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు వంటివి దేశ ప్రతిభను పెంపొందించేవి. ఇప్పుడు బీజేపీ దోపిడీ కారణంగా ఒక్క బోర్డు పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నాయి. ఆ సంస్థలను బీజేపీ ఈ దుస్థితికి తీసుకువచ్చింది. ప్రభుత్వం విద్యా సంస్థలను బలహీనపరుస్తోంది. విద్యార్థుల గొంతుకను అణచివేస్తోంది. యూజీసీని నాశనం చేసింది. విశ్వవిద్యాలయాల్లో కక్షపూరిత రాజకీయాలను రెచ్చగొట్టింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను తొలగించింది. వీసీల నియామకాలు సైద్ధాంతికంగా ప్రభావితమయ్యాయి. దేశంలో 90,000కు పైగా ప్రభుత్వ పాఠశాలను మూసివేసింది. గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపును తగ్గించింది."

**ఇదొక భారీ డేటా లీక్ : జైరాం రమేశ్**

సీబీఎస్‌ఈ ఓఎస్ఎం వివాదం నేపథ్యంలో కేంద్రమే టార్గెట్‌గా కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ విమర్శనాస్త్రాలు సంధించారు. మంత్రి ప్రధాన్ కుంభకోణాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన నేడు 20 లక్షల 12వ తరగతి విద్యార్థుల జవాబు పత్రాలు బహిరంగంగా అందుబాటులోకి వచ్చాయని ఆరోపించారు. ఇది 20 లక్షల మంది విద్యార్థుల గోప్యతను ప్రమాదంలో పడేసిన ఒక భారీ డేటా లీక్ అని అభిప్రాయపడ్డారు. దీంతో కోఎంప్ట్ అసమర్థత, నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైందన్నారు. ఆర్ఎఫ్‌పీ సాంకేతిక నిబంధనలను మార్చి సీబీఎస్‌ఈ కాంట్రాక్టును కోఎంప్ట్‌కు ఇచ్చారని అన్నారు. ఈ మార్పు బహుశా కోఎంప్ట్‌కు ప్రయోజనం చేకూర్చి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. "లీక్ అయిన జవాబు పత్రాలలో కాగితం మడతలు, డ్రాప్ షాడోల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా స్కానింగ్ మెషీన్లకు బదులుగా మొబైల్ ఫోన్లతో చేసిన స్కాన్‌లలో కనిపించే గుర్తులు ఇవి. మూడో ఆర్ఎఫ్‌పీలో రోబోటిక్ స్కానర్ల అవసరాన్ని తొలగించారని మనకు తెలుసు. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కోఎంప్ట్ నిజానికి ఎలాంటి స్కానర్లను ఉపయోగించింది? స్కాన్ నాణ్యత ఎందుకు ఇంత పేలవంగా ఉంది?" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు కూలీల దుర్మరణం



**బెంగళూరు:** కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి టౌన్ సమీపంలోని జాతీయ రహదారి 44పై జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు బాగేపల్లి టౌన్ శివారులోని గంగోత్రి పెట్రోల్ బంక్ సమీపంలో తమ విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా, వేగంగా వచ్చిన ఒక ట్రక్కు వారి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోను ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## యూపీ డీజీపీగా రాజీవ్ కృష్ణ.. నాలుగేళ్ల తర్వాత పర్మినెంట్ డీజీపీ నియామకం



ఉత్తర ప్రదేశ్ నూతన డీజీపీగా రాజీవ్ కృష్ణ నియామకమయ్యారు. నాలుగేళ్ల తర్వాత యూపీకి పర్మినెంట్ డీజీపీ నియామకమవ్వడం విశేషం. 2022 వరకు యూపీలో పర్మినెంట్ డీజీపీనే ఉండేవారు. చివరి పూర్తిస్థాయి డీజీపీగా ముకుల్ గోయెల్ ఉండేవారు. అప్పట్లో ఆయనను ప్రభుత్వం తొలగించింది. ఆ తర్వాత నుంచి యూపీలో తాత్కాలిక డీజీపీలనే ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. డీఎస్ చౌహాన్, ఆర్కే విశ్వకర్మ, విజయ్ కుమార్‌లు డీజీపీలుగా పని చేశారు. చివరగా 2025 మే నెలలో ప్రశాంత్ కుమార్‌ను తాత్కాలిక డీజీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పుడు ఆయన స్థానంలో రాజీవ్ కృష్ణ పూర్తిస్థాయి డీజీపీగా కొనసాగుతారు. ఆయన 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఆయన మరో మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. 2029 జూన్‌లో రిటైర్ అయ్యే వరకు ఆయనకు పదవీ కాలం ఉంది. ఇప్పటివరకు రాజీవ్ కృష్ణ విజిలెన్స్ విభాగం డీజీగా కొనసాగుతున్నారు. గతంలో ఆయన పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహించారు. అలాగే, యాంటీ టెర్రర్ స్క్వాడ్‌కు నేతృత్వం వహించారు. దేశంలోనే అత్యధిక పోలీసులు కలిగిన రాష్ట్రం యూపీనే.

## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి



భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30న ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా దిల్లీలోని సౌత్ బ్లాక్ లాన్స్‌లో జనరల్ రాజా సుబ్రమణికి త్రివిద దళాలు గౌరవ వందనాన్ని సమర్పించాయి. అనంతరం దేశ రాజధానిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. పాకిస్థాన్, చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందిన సుబ్రమణి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)లో సైనిక సలహాదారుగా సేవలు అందించారు. గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన పదవీ విరమణ చేశారు. సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. సైనిక దళాల బలోపేతం, త్రివిధ దళాల మధ్య సమన్వయం, ఏకీకరణకు సంస్థాగతంగా సంస్కరణలు తేవడమే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేయడం కొనసాగిస్తాయని, ఈ మేరకు దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, రాజా సుబ్రమణి సీడీఎస్ పదవితో పాటు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్' సెక్రటరీగా కూడా బాధ్యతలను నిర్వర్తించనున్నారు. "భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు గౌరవంగా ఉంది. సాయుధ దళాలపై దేశం ఉంచిన నమ్మకానికి మేం కృతజ్ఞులం. భారతదేశ భద్రతను బలోపేతం చేసే 'సమగ్ర దేశ విధానంలో' భాగంగా మేం, భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, రక్షణ మంత్రిత్వ శాఖ, వ్యూహాత్మక సంస్థలు, సంబంధిత వర్గాలన్నీ ఐక్యంగా నిలుస్తాం. ఈ ప్రయాణంలో ఆదర్శప్రాయమైన నాయకత్వానికి, సహకారానికి గాను, నా విశిష్ట పూర్వాధికారులైన దివంగత జనరల్ బిపిన్ రావత్, జనరల్ అనిల్ చౌహాన్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన సైనికులు, నావికులు, వాయుసేన యోధుల ధైర్యాన్ని, వృత్తి నైపుణ్యాన్ని మేం ఎప్పుడు గుర్తుంచుకుంటాం. వారి శిక్షణ, సంక్షేమం మా ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుంది. వారి శౌర్యం, త్యాగం, దేశభక్తి మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. మన మాజీ సైనికులు, వీరనారీల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, గౌరవం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేస్తూనే ఉంటాయని నేను భారత పౌరులకు హామీ ఇస్తున్నాను."

**'ఆత్మనిర్భరత మన జాతీయ భద్రతకు మూల స్తంభం'**

మరోవైపు, ఆత్మనిర్భరత గురించి కూడా సీడీఎస్ మాట్లాడారు. "ఆత్మనిర్భరత మన జాతీయ భద్రతకు మూల స్తంభం. ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్ అనే దార్శనికతను అమలు చేయడానికి మేం కట్టుబడి ఉన్నాం. సాయుధ దళాల పరివర్తన, జాయింట్‌నెస్, సినర్జీ, ఇంటిగ్రేషన్‌ను పెంపొందించే దృష్టి కేంద్రీకరిస్తాం. అలాగే, మన సాయుధ దళాల్లో స్వదేశీ ఆయుధాల అభివృద్ధి, ప్రవేశం, ఏకీకరణను వేగవంతం చేస్తాం. ఆలోచన, కార్యచరణలో నూతనత్వం మన సామర్థ్యానికి, అభివృద్ధికి చోదకశక్తిగా ఉంటాయి. సైన్యం, పరిశ్రమ, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా వ్యవస్థల మధ్య అధిక సహకారం ఆధునీకరణకు కీలక చోదకశక్తిగా ఉంటుంది. మన జాతీయ ప్రయోజనాలను కాపాడటంలో మన సాయుధ దళాలు నిరంతరం వృత్తి నైపుణ్యాన్ని, కార్యాచరణ నిర్ణయాత్మకతను ప్రదర్శించాయి" అని సుబ్రమణి తెలిపారు.

## హెల్మెట్ పెట్టుకోకపోయి ఉంటే అభిషేక్ చనిపోయేవాడు
## మేనల్లుడిపై జరిగిన దాడిపై మమత ఫైర్

తన మేనల్లుడు, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సోనార్‌పుర్‌లో అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి తర్వాత ఆయన ఛాతీలో రక్తపు గడ్డలు ఏర్పడ్డాయని తెలిపారు. ఎవరో అభిషేక్‌కు హెల్మెట్ పెట్టకపోయి ఉంటే ఆయన చనిపోయి ఉండేవాడని ఆరోపించారు. ప్రజలు రాళ్లు విసరడం, శారీరకంగా దాడి చేయడం వల్ల తన మేనల్లుడి ఛాతీ, పక్కటెముకల ప్రాంతంలో గాయాలయ్యాయని పేర్కొన్నారు. అభిషేక్‌కు సరైన చికిత్స అందించకుండా ఉండేందుకు ఆస్పత్రులపై పైనుంచి ఒత్తిడి ఉందని విమర్శించారు.

**పోలీసులు భద్రత కల్పించలేకపోయారు : మమత**

అభిషేక్‌కు చికిత్సను విశ్వసనీయ వైద్యులు తమ కుటుంబ వైద్యుల పర్యవేక్షణలోనే కొనసాగించాలని మమతా బెనర్జీ కోరారు. అభిషేక్ సోనార్‌పుర్ పర్యటన గురించి పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, వారు ఎందుకు తగిన భద్రత ఏర్పాట్లు కల్పించలేకపోయారని ప్రశ్నించారు. హింసను సృష్టించేందుకే బీజేపీ బయటి వ్యక్తులను రప్పించిందని ఆరోపించారు. బీజేపీ చట్ట ప్రకారం పనిచేయాలని కోరారు. కాషాయం పార్టీ కనీసం ఎవరినీ చికిత్స పొందనీయడం లేదని ఆరోపించారు. ఆస్పత్రికి వచ్చినవారిలో ఎవరికి చికిత్స చేయాలి? ఎవరికి చేయకూడదు? అనే దానికి బీజేపీ నుంచి అనుమతి కావాలని మండిపడ్డారు. అంత అమానవీయంగా బీజేపీ తయారయ్యిందని ఫైర్ అయ్యారు. "నిజంగా అభిషేక్‌ను ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం లేకపోతే అతడిని మొదట ఐసీయూకి ఎందుకు తరలించారు. పలు వైద్య పరీక్షలు, స్కాన్‌లు చేయించుకోమని ఎందుకు సలహా ఇచ్చారు? అభిషేక్‌ను పరీక్షించిన డాక్టర్లు పలు గాయాలను గమనించారు. తక్షణ వైద్య పరీక్షలు చేయించుకోమని అభిషేక్‌కు సలహా ఇచ్చారు. అభిషేక్ ముఖం, వీపు, ఛాతీ, మెడపై పలు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన రోగికి చికిత్స అందించే విషయంలో వైద్యులు, ఆస్పత్రి అధికారులపై ఒత్తిడి తేవడం అత్యంత ఆందోళనకరమైన అంశం. రోగిని ఆస్పత్రిలో చేర్చుకోవడం, డిశ్చార్జ్ చేయడం, చికిత్స అందించడం వంటి నిర్ణయాలు పూర్తిగా వైద్యులకు సంబంధించిన అంశంగా ఉండాలి. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి. రాజకీయ విభేదాలకు హింస, బెదిరింపులు, ఆయుధాలు ఏమాత్రం పరిష్కారం కావు. బీజేపీ అభిషేక్ బెనర్జీకి చికిత్స అందకూడదనే ఉద్దేశంతో అన్ని ఆస్పత్రులను బెదిరిస్తోంది. నేను ఓ ఆస్పత్రి నిర్వాహకుడితో కూర్చున్నప్పుడు తనకు పోలీసుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన నాతో చెప్పారు. వైద్యులు బాధలో ఉన్నారు. వారిపై ఒత్తిడి ఉంది. రాహుల్ గాంధీ నాకు ఫోన్ చేశారు. అభిషేక్ బెనర్జీని చికిత్స కోసం హైదరాబాద్‌కు గానీ లేదా మరెక్కడికైనా తరలించమని సూచించారు"

**నాపై దాడికి బీజేపీయే కారణం : అభిషేక్**

తనపై దాడికి బంగాల్‌లో ఇటీవలే అధికారంలోకి వచ్చిన బీజేపీయే కారణమని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఇదంతా బీజేపీ ప్రేరేపిత చర్యే అని మండిపడ్డారు. ఇదేనా బీజేపీ ప్రజాస్వామ్య నమూనా? ఎన్నికలు జరిగి కనీసం నెల రోజులు కూడా గడవకముందే ఇలా చేస్తున్నారని విమర్శించారు. తన రాజకీయ ప్రత్యర్థులను హత్య చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. కాగా, అభిషేక్‌పై దాడి ఘటనలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోపైపు అభిషేక్‌పై దాడిపై తృణమూల్ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీజేపీ ధీటుగా తిప్పికొట్టింది. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని 'కర్మ రిటర్న్స్'గా బీజేపీ నాయకురాలు కీయా ఘోష్ వ్యాఖ్యానించారు. "గత 15 ఏళ్లుగా తృణమూల్ ప్రభుత్వ హయాంలో బంగాల్ ప్రజలు అనేక అకృత్యాలను చూశారు. ఈ రోజు వారికి (అభిషేక్‌కు) ఆ కర్మ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. కర్మ అంటే ఏమిటో మీకు తెలుసా? మీరు ఏది చేశారో, అదే మీకు తిరిగి లభిస్తుంది" అని ఆమె తెలిపారు.

# ప్రభుత్వ అనుమతులు లేని సన్ రైజ్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి ఎఐయస్ ఎఫ్

**నంద్యాల:మే=31 ప్రజాజ్యోతి** భువన విజయం టు సన్ రైజ్ పేరు మారిన -- మారని మేనేజ్మెంట్ సర్టిఫికెట్ మా కాలేజీలో తప్పకుండా చేరాలంటూ విద్యార్థులపై ఒత్తిడి కచ్చితంగా చేరాలంటూ ప్రమాణం చేయించుకుంటున్న కళాశాల యాజమాన్యం విద్యార్థుల హక్కులు కాలరాస్తూ రెండు సంవత్సరాలు మా కాలేజీలోనే ఉండాలంటూ అగ్రిమెంట్ చేయించుకుంటున్న వైనం సన్ రైజ్ కళాశాల చేస్తున్న తప్పుడు ప్రచారాలపై నోరుమెదపని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు. జూనియర్ కళాశాలకు అనుమతి కావాలంటే 8400 స్వ్కర్ ఫీట్ విస్తీర్ణం ఉండాలి -- సన్ రైజ్ కళాశాల భవనానికి 5000 స్వ్కర్ ఫీట్ కూడా లేకున్నా ఏ విధంగా అనుమతులు ఇచ్చారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులను ప్రశ్నించిన ఎఐయస్ ఎఫ్ ఎఐవైఎఫ్ నేతలు క్రింద హాస్పిటల్ పైన సన్ రైజ్ కళాశాల కమర్షియల్ బిల్డింగ్ లో ఏ విధంగా అనుమతులు ఇచ్చారు. ఇరుకిరుకు తరగతి గదులు--పార్కింగ్ స్థలం లేదు-ఆటస్థలం లేదు- శానిటేషన్ సర్టిఫికెట్ లేదు-బిల్డింగ్ ఫిట్నెస్ సర్టిఫికెట్ లేదు- ఎటువంటి సదుపాయాలు లేని సన్రైజ్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఎందుకు సీజ్ చేయలేదు- అంతర్యామేమిటి. డైరెక్టర్, ప్రిన్సిపాల్ గా ఉండాలంటే ఎంయస్ సి గాని, పిజి గాని, ఫ్ట్, గాని ఉండాలి --- కానీ సన్ రైజ్ కళాశాల డైరెక్టర్లకు,ప్రిన్సిపాల్ కు ఉన్న విద్యార్హత ఏమున్నది. సన్ రైజ్ కళాశాల ప్రారంభంలోనే లక్ష నుండి లక్ష 50 వేల వరకు ఫీజులు వసూలు చేయడానికి ఎవరు అనుమతులు ఇచ్చారు? లక్షలకు





లక్షలు ఫీజు వసూల్ చేస్తుంటే జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఏమి చేస్తున్నారు. జెఇఇ, ఎన్ఇఇటి, ఇఎంసిఇటి కోచింగ్ ల పేరుతో ఫీజులు దందా చేస్తున్న సన్ రైజ్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తెససుకోకపోతే ఇంటర్మీడియట్ కమిషనర్ కు పిర్యాదు చేస్తాం ఫీజుల దందా చేస్తున్న సన్ రైజ్ జూనియర్ కళాశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి -- సన్ రైజ్ జూనియర్ కళాశాలను సీజ్ చేయా సన్ రైజ్ జూనియర్ కళాశాలను సీజ్ చేసి,చర్యలు తీసుకోకపోతేప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధంఅవుతాం,రాష్ట్ర స్థాయి అధికారులకు పిర్యాదు చేస్తామన్న ఎఐయస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి ఎఐవైఎఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి ఉదయ్

# వైయస్సార్ విగ్రహం ధ్వంసం ఘటన

**-- వెన్నుపోటు పార్టీ దుర్బుద్ధి బయటపడింది...**

**నంద్యాల:మే=31 ప్రజాజ్యోతి** వైయస్సార్ విగ్రహంపై దాడి జరిగిన వెంటనే, కొన్ని రాజకీయ శక్తులు ముందస్తు ప్రణాళికతోనే బురదజల్లే కార్యక్రమానికి తెరలేపాయా అనే అనుమానాలకు బలాన్ని చేకూరుస్తూ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి: ఆ 'రెండు నిమిషాల' వెనుక ఉన్న రహస్యమేంటి?లి విగ్రహంపై దాడి జరిగిందని తెలిసిన వెంటనే, కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే టీడీపీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వైస్సార్సీపీకి సంబంధించిన పాత ఫోటోలు ఎలా ప్రత్యక్షమయ్యాయి ఇంత వేగంగా కంటెంట్





మరియు ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టడం వెనుక ఉన్న అసలు కూటమి నేతలు ఎవరు? ఇది ముందస్తు వ్యూహంలో భాగమేనా నిందితుడి రాజకీయ నేపథ్యంపై అసత్య ప్రచారం ఎందుకు విగ్రహాన్ని ధ్వంసం చేసిన జంబులయ్య అనే వ్యక్తి 2019 సంవత్సరం నుండి వైస్సార్సీపీలో లేనే లేడు. అయినా సరే, అతను వైస్సార్సీపీ కార్యకర్త అంటూ పాత ఫోటోలను (2019కి ముందువి) వాడుతూ ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేవలం వైస్సార్సీపీ నేతలపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు కూటమి నాయకుల అజెండా దీని వెనుక ఉందా మెడికల్ రిపోర్ట్‌లో 'సెప్టెంబర్ 2026' -- ఫేక్ రిపోర్ట్ గుట్టు రట్టయిందా. నంద్యాలలోని 'సంజీవని క్లినిక్' లో జంబులయ్యకు వైద్య పరీక్షలు చేయించినట్లు చూపుతున్న మెడికల్ రిపోర్ట్‌లో డేట్ "29 సెప్టెంబర్ 2026"లి అని ఉండటం అందరినీ విస్తుపోయేలా చేస్తోంది. ప్రస్తుతం మనం మే 2026 లో ఉంటే, ఇంకా రాబోయే సెప్టెంబర్ నెల డేట్ ఆ రిపోర్ట్‌లో ఎలా వచ్చింది అనుమానం: భవిష్యత్తు తేదీతో ఉన్న ఈ మెడికల్ రిపోర్ట్‌ను చూస్తే... ఇదంతా ముందస్తుగా ప్రిపేర్ చేసిన ఒక పెద్ద స్క్రిప్ట్ అని స్పష్టం కావడం లేదా సోషల్ మీడియాలో ఈ తప్పును గమనించి వెంటనే ఆ రిపోర్టును ఎందుకు డిలీట్ చేశారు. పోలీసుల విచారణపై తలెత్తుతున్న ప్రశ్నలు ఈ మొత్తం వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నట్లు ప్రచారంలో ఉన్న లి'వందన బార్'లి పై పోలీసులు ఇప్పటివరకు ఎందుకు కేసు నమోదు చేయలేదు. అసలు నిందితుడు జంబులయ్య యొక్క కాల్ డేటా నుపోలీసులు ఎందుకు పూర్తిగా ట్రాక్ చేయడం లేదు అతని కాల్ హిస్టరీ తీస్తే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తేలిపోతుంది కదా గ్రహం ధ్వంసం కావడం దుర దృష్టకరం, కానీ ఆ ఘటనను ఆసరాగా చేసుకుని పాత ఫోటోలతో, భవిష్యత్తు డేట్లతో ఉన్న ఫేక్ మెడికల్ రిపోర్టులతో క్షణాల వ్యవధిలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ప్రారంభించడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు ఈ ప్రశ్నల ద్వారా స్పష్టమవుతున్నాయి.

# గొల్లప్రోలులో సేవా స్ఫూర్తికి నిదర్శనం

## ఉచిత కంటి వైద్య శిబిరంలో 126 మందికి పరీక్షలు -- 30 మందికి శస్త్రచికిత్సలు

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)**గొల్లప్రోలు లో సమాజ సేవకు యువత అంకితభావంతో ముందుకు వస్తే ఎంతటి మంచి ఫలితాలు సాధించ వచ్చు అని గొల్లప్రోలులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం మరోసారి నిరూపించింది. స్థానిక ఈబీసీ కాలనీలో స్మార్ట్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో, ప్రముఖ వాసన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం ఘన విజయాన్ని సాధించింది. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించగా, మొత్తం 126 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, 30 మందిని ఉచిత శస్త్రచికిత్సలకు ఎంపిక చేయడం విశేషం.

**ప్రజల నుంచి విశేష స్పందన**

ఆదివారం ఉదయం నుంచే శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వృద్ధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం రోగుల కంటి సమస్యలను గుర్తించి తగిన వైద్య సూచనలు అందించింది. అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేసింది.

**30 మందికి వెలుగు చూపనున్న శస్త్రచికిత్సలు**

పరీక్షలు చేసిన వారిలో శుక్లాలు మరియు ఇతర తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందిని వైద్యులు గుర్తించి ఉచిత శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. వీరికి త్వరలోనే ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఆపరేషన్లు





నిర్వహించనున్నారు. దీంతో పలువురు పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గనుంది.

**దాతల సహకారంతో విజయవంతమైన శిబిరం**

ఈ సేవా కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు విశేషంగా అండగా నిలిచారు. వైఎస్సార్సీపీ చైర్‌పర్సన్ గండేటి శ్రీరామచంద్రమూర్తి శిబిరానికి వచ్చిన రోగులు, వైద్య బృందం, యువతకు నాణ్యమైన భోజన వసతి కల్పించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అలాగేగొల్లప్రోలు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు మరియు వైఎస్సార్సీపీ నాయకులు జ్యోతుల భీముడు ఆర్థిక సహాయం అందించి శిబిరం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.

**యువత సేవాభావానికి ప్రశంసలు**

కార్యక్రమం ముగింపు సందర్భంగా స్మార్ట్ కాలనీ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. శిబిరానికి సహకరించిన వైద్య బృందానికి, ఆర్థిక సహాయం అందించిన దాతలకు, భోజన వసతి కల్పించిన గండేటి శ్రీరామచంద్రమూర్తి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ కాలనీ యూత్ అధ్యక్షుడు తోట నూకరాజు, కొసిరెడ్డి రాజా, గండే వాసు, కొచ్చర్ల నాగభూషణం, మొండి రాంబాబు, దొడ్డి నాగరాజు, పున్నం ప్రసన్నకుమార్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# నక్కవానిపల్లి యువకుడు అగ్నివీర్‌గా ఎంపిక

**ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండలం నక్కవానిపల్లి గ్రామానికి చెందిన నక్క రామాంజనేయులు కుమారుడు వంశీకృష్ణ భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఇటీవల విడుదలైన అగ్నివీర్ నియామక ఫలితాల్లో ఆయన ప్రతిభ కనబర్చి విజయాన్ని సాధించి దేశ సేవకు సిద్ధమయ్యారు. వంశీకృష్ణ ఎంపికతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే దేశ సేవపై ఆసక్తి కలిగిన వంశీకృష్ణ క్రమశిక్షణతో కష్టపడి ఈ విజయాన్ని సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అగ్నివీర్‌గా విధులు నిర్వహిస్తూ తన ప్రతిభను నిరూపించుకొని



భవిష్యత్తులో శాశ్వత సైనికుడిగా ఎంపిక కావడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన యువకుడు భారత సైన్యంలో అవకాశం దక్కించుకోవడం పట్ల నక్కవానిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వంశీకృష్ణను అభినందించారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకొని గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఆంధ్రాలోని పురాతన ఆలయాలు కొన్ని:

**నంద్యాల:మే=31 ప్రజాజ్యోతి** తొలిసారి ఆంధ్ర ప్రస్తావన సామాన్య శకం పూర్వం 1500-800 మధ్యలో వచ్చింది. తర్వాత సా.శ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు రాయబారి చంద్రగుప్త మౌర్యుని సామ్రాజ్యానికి వచ్చినప్పుడు ఆంధ్ర గురించి తన గ్రంథంలో తెలియజేసాడు. శాతవాహనుల కాలం, బౌద్ధం, మహాభారతం లోను ఆంధ్రా ప్రస్తావన ఉంది. గుడిమల్లం: తిరుపతి దగ్గరలోని గుడిమల్లంలో ఉన్న పరమేశ్వర ఆలయం, భారతదేశంలోని అత్యంత పురతన ఆలయం. దీనిని సామాన్య శకం పూర్వం 2,3వ శతాబ్దానికి చెందినది. అమరలింగేశ్వర: పల్నాడులోని అమరారామం




శాతవాహనుల కాలం సామాన్య శకం పూర్వం 2వ శతాబ్దానికి చెందినది. శ్రీకూర్మం: శ్రీకాకుళంలోని కళింగ, చోళ రాజుల కాలం సా.శ. 2వ శతాబ్దంలో నిర్మించినది. తిరుమల తిరుమల: ఆంధ్రాలో ప్రముఖమైన ఆలయం తిరుమల తిరుపతి ఆలయాన్ని చారిత్రక ఆధారాల ప్రకారం సా.శ. 4వ శతాబ్దానికి చెందినది. సామాన్య శకం పూర్వం నుంచే ఈ ఆలయ ప్రస్తావన ఉంది. కపోతేశ్వర: పల్నాడు జిల్లా చేజర్లలోని కపోస్వామి ఆలయం సా.శ 4వ శతాబ్దంలో నిర్మించారు. యాగంటి ఉమామహేశ్వర: నంద్యాల జిల్లా యాగంటి ఉమామహేశ్వర ఆలయాన్ని సా.శ 5,6వ శతాబ్దంలో నిర్మించారు. ఇంద్రకీలాద్రి: విజయవాడలోని కనకదుర్గదేవి ఆలయ ప్రస్థానం 5వ శతాబ్దం నుంచి ఉంది. శ్రీశైలం: ఆంధ్రలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున ఆలయాన్ని 7వ శతాబ్దంలో నిర్మించారు. దీని చరిత్ర సామాన్య శకం పూర్వం నుంచే ఉంది. లిఆంధ్రాలోని పంచారామ క్షేత్రాలు 9,11వ శతాబ్దానికి చెందినవిరి.

# పల్నాడు, పై భానుడు- విశ్వరూపం..!



**ప్రజాజ్యోతి - పల్నాడు,** మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో రోజు రోజుకి భానుడి విశ్వరూపం నిప్పులు కొలిమిలా మారుతుంది ప్రజలు కాలు బయట,పెట్టాలంటేనే గజగజ వనికి పోతున్నారు అగ్నికి వాయువు తోడైనట్టు ఈ తీవ్ర ఎండకు వడ గాలులు తోడవడంతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి కాలు బయటపెట్టాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు ఈరోజు రాజుపాలెం గ్రామంలో 40 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం జరిగింది ఈ అధిక ఎండ తీవ్రతకు ముసలి ముతాక చిన్న పెద్ద ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు మరోపక్క ఇళ్లల్లో ఫ్యాన్లు తిరిగినప్పటికీ వేడి ఊక పూతకు అల్లాడిపోతున్నారు కొంత మేరకు ప్రయాణాలు మానుకున్నప్పటికీ చిన్న పనికి పెద్ద పనికి బయటికి వెళ్లడం తప్పడం లేదని ప్రజల వాపోతున్నారు భానుడు విశ్వరూపం శాంతించాలని వాతావరణం చల్లబడాలని తాము పనులు తాము చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# పదవి విరమణ సందర్భంగా లక్ష్మీనారాయణ ను సన్మానించిన: బిఎస్ కృష్ణారెడ్డి

**గుంతకల్లు మే 31 (ప్రజా జ్యోతి):** పట్టణం నందు మున్సిపల్ కార్యాలయం లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న బెనిగేరి లక్ష్మీనారాయణ ఆదివారం పదవి విరమణ సందర్భంగా ఈద్గా ఫంక్షన్ హాల్ నందు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బిఎస్ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్ష్మీనారాయణ కు ప్రశంసలు తెలియజేస్తూ ఆయన్ను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలోమున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్ట శంకరయ్య, అలాగే టీచర్లు



మల్లికార్జున, ఈపీఓ మోహన్, మాజీ కౌన్సిలర్ రంగన్న, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది. రాజేంద్రప్రసాద్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాగలమర్రిలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక





**చాగలమర్రి , మే 31( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1983-1984 వ సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థుల కలయికతో ఆదివారం సమావేశమయ్యారు.దాదాపుగా రెండు సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థి దశలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మురిసిపోయారు.అనంతరం గురువులు వెంకట్ రెడ్డి , ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవయ్య లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు జెట్టి నాగరాజు , వల్లం రాము , బోధనం లక్ష్మయ్య యాదవ్ , బచ్చు సుబ్రమణ్యం , వంకదార లక్ష్మణబాబు , బడిగేంచల చక్రపాణి , సుబ్బనరసయ్య , రామ చంద్ర రెడ్డి , తదితర తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

# చాగలమర్రిలో ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన







**చాగలమర్రి , మే 31(ప్రజా జ్యోతి న్యూస్) ;** మండల కేంద్రమైన చాగలమర్రిలోనీ క్రిస్టియన్ ఫెలోషిప్ హాస్పిటల్ ( కేరళ ఆసుపత్రి)నందు హాస్పిటల్ యాజమాన్యం వైద్యులు డాక్టర్ ప్రకాష్ జార్జ్ ఆధ్వర్యములో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో ఉదయానంద హాస్పిటల్ సీనియర్ గుండె వైద్య నిపుణులు రామేశ్వర్ రెడ్డి రోగులను పరీక్షించి టెస్ట్ లు ఉచితంగా చేసి మందులను రాసిచ్చారు. పేషంట్ కెపి తాండాకు చెందిన రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గుండె నొప్పి ఉన్న ప్రతి పేషెంట్ కు ఈ టెస్ట్ లు ఉచితంగా చేయడం వల్ల చాలా ఉపయోగకరమని తెలిపాడు.ఈసీజీ , 2డి ఎకో పరీక్షలు ఉచితంగా చేశారన్నారు.

# పోలవరం నిర్వాసితులకు నాలుగు రెట్లు ప్యాకేజీ ఇవ్వాలి



**కూనవరం, మే 31 (ప్రజాజ్యోతి):** పోలవరం ప్రాజెక్టు ముంపు నీటి నిల్వ పరిధి నుంచి కిలోమీటర్‌కు పైగా దూరంలో ఉన్న కుటుంబాలకు కూడా పునరావాసం మరియు పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ వర్తింపజేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. అలాగే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ముంపు భూములకు ప్రస్తుతం అమలులో ఉన్న పరిహారాన్ని నాలుగు రెట్లు పెంచి చెల్లించాలని కోరింది.సీపీఎం కూనవరం మండల కార్యదర్శివర్గ సమావేశం కూటూరు గ్రామంలో మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి కోసం త్యాగం చేస్తున్న పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.ప్రాజెక్టు నీటి నిల్వ పరిధికి సమీపంలో ఉన్న ప్రజలు అక్కడ నివసించడం సురక్షితం కాదని తెలిసినా, “ఇళ్లు మునగవు” అనే కారణంతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిరాకరించడం అన్యాయమని ఆయన అన్నారు. జాతీయ ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులవుతున్న వారికి చట్టప్రకారం నాలుగు రెట్లు పరిహారం అందించాల్సి ఉండగా, ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2007--08 సంవత్సరాల్లో భూములు సేకరించి పరిహారం చెల్లించినప్పటికీ, గిరిజనులకు భూమికి భూమి చూపించడంలో జరిగిన జాప్యంతో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కొత్త ప్యాకేజీ వర్తింపజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు ఆ చట్టాన్ని అమలు చేయకుండా గిరిజనులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. అలాగే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమిని ఐదేళ్లలోపు వినియోగంలోకి తీసుకురాకపోతే భూ యజమానులకే హక్కులు తిరిగి వస్తాయని, లేదా కొత్త నోటిఫికేషన్ జారీ చేసి పెరిగిన పరిహారంతో భూమిని సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఈ నిబంధనలను అమలు చేయకుండా ముంపు బాధితులను మోసగిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అందించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మడకం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# సెలవు రోజున సొంత పొలంలో వ్యవసాయ పనులు చేసిన మంత్రి నిమ్మల





**స్వంత గ్రామానికి 14 కిలోమీటర్లు సైకిల్ పైనే ప్రయాణం.**


**పాలకొల్లు. ప్రజాజ్యోతి ప్రతినిధి కొట్టి రామం. మే 31.** రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సెలవు రోజయిన ఆదివారం మరోసారి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై రైతుగా మారారు. ఆదివారం తెల్లవారుజామున పాలకొల్లులోని తమ ఇంటి నుంచి ఏడు కిలోమీటర్లు దూరంలో గల తమ స్వగ్రామమైన ఆగర్తి పాలెం సైకిల్ తొక్కుకుంటూ వెళ్లారు. అక్కడ ఉన్న సొంత రొయ్యల చెరువులను పరిశీలించి రొయ్యలకు మేత వేశారు. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం సొంత పొలం వెళ్లి వ్యవసాయ కార్మికులతో కలిసి పనుల్లో భాగస్వామ్యం అయ్యారు. అక్కడ ట్రాక్టర్ ను స్వయంగా నడుపుతూ దుక్కు దున్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేసి అభివృద్ధి చేస్తున్న హిందూ స్మశాన వాటిక పురోగతి పనులను పరిశీలించారు. అక్కడ కాసేపు ఉండి తిరిగి మళ్లీ సైకిల్ పై బయలుదేరి పాలకొల్లు తమ ఇంటికి చేరుకున్నారు. మంత్రి నిమ్మల ప్రయాణించిన రోడ్ లో జలజీవన్ మంచినీటి పనులకు సంబంధించిన పైప్ లైన్ పనులు రోడ్డు వెంబడి జరుగుతుండడంతో సిమెంట్ రోడ్డు మంజూరైనందున భవిష్యత్తులో పైపులైన్ కి సంబంధించి మరమత్తులు చేయాల్సి వస్తే సిమెంట్ రోడ్డు తవ్వకుండా పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మధ్యలో తనను పలకరించిన ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి తీరిక సమయం దొరకడంతో తమ వ్యవసాయ పనుల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని, అపారమైన ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రైతు జీవితం, భూమి సారం, రాష్ట్ర అభివృద్ధి---ఇవన్నీ ఒకే దిశగా సాగుతున్న ఈ క్షణాలు తనకు మరపురాని అనుభూతిని కలిగించించాయని అని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు.

# ధర్మారం గేట్ దగ్గర నిర్మిస్తున్న యు బ్రిడ్జిని పరిశీలించిన సిపిఐ నాయకులు



**గుంతకల్లు మే 31 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలో ధర్మారం గేట్ దగ్గర నిర్మిస్తున్న యు బ్రిడ్జిని ఆదివారం సిపిఐ నాయకుడు పరిశీలించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోవింద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి మాట్లాడుతూ గుంతకల్లు పట్టణా వాసులకు దశాబ్దాల కాలం నుండి ధర్మవరం గేట్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిరంతరము అంతరాయం కలుగుతూ వస్తున్నది. కాలక్రమేనా అది విపరీతంగా నేటికీ జనాభా పెరిగింది. సిపిఐ పార్టీ దశాబ్దాల కాలం నుండి ఎవరికి ఇబ్బంది కలుక్కోకుండా స్ట్రెట్ గా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని గాని, లేక ప్లే ఓవర్ బ్రేడ్జ నిర్మించాలని ప్రజల పక్షాన సిపిఐ గొంతుక వినిపిస్తూ ఉన్నది. కానీ 2024 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఆర్భాటాలతో దశాబ్దాల నుండి ఇబ్బంది కలుగుతున్నటువంటి ధర్మవరం గేటును యు బిజీ నిర్మాణాలు నిర్మాణాలు చేపడుతున్నామని శంకు స్థాపన కూడా చేయడం జరిగింది. అనంతరం 16-1- 26న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూడా ఆర్భాటంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భూమి పూజ చేయడం జరిగింది. తొందరలో పని ముగుస్తుం దని కూడా ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ప్రజల మనోభావాలతో చెలగాటమా డుతున్నారు.ఇది మంచిది కాదని సిపిఐ పార్టీగా హెచ్చరిక చేస్తున్నాం. ఓ పక్కన రైల్వే డిఆర్ఎం భూ సేకరణ చేస్తే 9 నెలలు యు బ్రిడ్జిని ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మరి ఆర్భాటంగా భూమి పూజ చేసినటువంటి ఎమ్మెల్యే భూ సేకరణకు రెండు కోట్ల 25 లక్షలు చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా ఈ యు బిర్జు నిర్మాణానికి 16 ఇండ్లు తొలగించాల్సి వస్తుంది. దీనికి కూడా వారు అంగీకరించారు. ఈరోజు, రేపు అని మీకు నష్టపరిహారం చెల్లిస్తామని గత రెండు సంవత్సరాలుగా చెప్పుకునే వస్తున్నారు. ఇంతవరకు పూర్తి కాలే పూర్తి చేయకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సిపిఐ పట్టణ పార్టీగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య ,సిపిఐ పట్టణ కమిటీ సభ్యులు దేవేంద్ర, ఏఐవైఎఫ్ నియోజక వర్గ నాయకులు నందు, బబ్బి పాల్గొనడం జరిగింది.

# ద్రోణాచలం స్కూల్ డైరెక్టర్ తల్లిదండ్రులు అపోహలు నమ్మకండి,



**డోన్ ప్రజా జ్యోతి న్యూస్ మే 31, (రిపోర్టర్ కే శ్రీను డోన్)** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో, మంచిఉత్తమ విద్యను విద్యార్థిని విద్యార్థులకుఅందించడమే లక్ష్యంగా పనిచేయుటకు మేము హార్నిశలు కష్టపడి మంచి మెరిట్ ఉన్న టీచర్లను ఎంపిక చేసుకొని ఉన్నాం కానీ మా స్కూలుపై దుష్ప్రచారం కొందరు అదేపనిగా పని కట్టుకొని స్కూలుకు చెడ్డ పేరు తేవాలని చూస్తున్నారు. స్కూల్ కు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు అపోహలు వీడండి. ద్రోణాచలం స్కూల్ పేరు మీదనే స్కూలు నడుపుతున్నాం సిబిఎస్ కోర్స్ త్వరలోనే అనుమతులు వస్తాయి ఆ తర్వాత సిబిఎస్ కోర్స్,క్లాసులు కూడా నడుపుతాం ఎవరికైనా పేరెంట్స్ కైనా పెద్దలు ఎవరికైనా అనుమానాలు ఉంటే మా స్కూలుపై మమ్మల్ని వచ్చి కలవండి ప్రతి విషయం క్లుప్తంగా వివరిస్తాం ప్రతి అధికారికి వివరించాం పర్మిషన్ తెచ్చుకున్నాం మాకు అందరూ సహకరించండి తెలిసి తెలియక ఎవరు స్కూలు గురించి అనవసరంగా రాద్ధాంతం చేయకండి పిల్లల భవిష్యత్తు చుట్టుపక్కల ప్రాంతం వాళ్లకు టౌన్, గ్రామాల నుండి పిల్లలకు భవిష్యత్తు కోసం మంచి స్కూల్ ఏర్పాటు చేశాం స్కూల్ కు ప్రభుత్వ అనుమతులు అన్నీ ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఫీజులను చెల్లించి నమ్మకంతో తమ పిల్లలను పాఠ శాలలకు పంపుతున్నారని అటువంటి వారికి మంచి జరగాలన్న ఉద్దేశంతోనే సీబీఎస్ కోర్సును త్వరలో అమలు చేస్తామని తెలిపారు, తమ స్కూల్ పై ఉన్నత విద్యా శాఖ అధికారులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారనీ,విద్యార్థుల తల్లిదండ్రులు నిర్భయంగా తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ద్రోణాచలం స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ అహ్మద్ నవాజ్ తెలిపారు.

# ఘనంగా రాజీవ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు




**- ముగతి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బజారమ్మ**

**నందవరం మే 31 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలో ముగితి గ్రామ వైఎస ఆర్సిపి అధ్య క్షులు బజారమ్మ, ఎం పీటీసీ పురుషోత్తం రెడ్డి ఆధ్వ ర్యంలో బైక్ ర్యాలీతో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పుట్టి నరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారని ముగితి గ్రామ అధ్యక్షులు బజారమ్మ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందవరం మండలం ఆయా గ్రామాలలో నుండి 500 మంది దాకా బైక్ ర్యాలీతో వచ్చి గజమాలతో సత్కరించారు. ఎర్రకోట సైన్యం అంటేనే నియోజకవర్గ అభివృద్ధి పదాత మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి నియోజకవర్గం సమన్వయకర్తగా ప్రజలలో ఈ సమస్య వచ్చినా వెన్నంటే ఉండి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందవరం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు కనకవిడు లక్ష్మి కాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, వైఎస్ఆర్సిపి యూత్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి' కథనానికి ఫలితం..!

## 24 గంటల్లోనే కదిలిన యంత్రాంగం -- బాగుపడిన చేతిపంపు

## తీరిన తాగునీటి కష్టాలు.. 'ప్రజాజ్యోతి'కి గ్రామస్తుల కృతజ్ఞతలు

**కూనవరం, మే 31 (ప్రజాజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారంలో 'ప్రజాజ్యోతి' మరోసారి తన బాధ్యతను నిరూపించింది. అధికారుల నిర్లక్ష్యం, మెకానిక్ మొండివైఖరి కారణంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పొట్లవాయిగూడెం గ్రామ ప్రజల గోడును వెలుగులోకి తెచ్చిన 'ప్రజాజ్యోతి' కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. "అధికారుల 'వరం'... మెకానిక్ 'శాపం'!" అనే శీర్షికతో శు క్రవారం ప్రచురితమైన ప్రత్యేక కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామ ప్రజల తాగునీటి కష్టాలను కళ్లకు కట్టినట్లు వివరించిన ఈ కథనం ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించింది. కథనం వెలువడిన 24 గంటల్లోనే అధికారులు చర్యలు చేపట్టి, మరో మెకానిక్‌ను గ్రామానికి పంపించారు. ఆయన యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి ఆదివారం నాటికి చేతిపంపుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించారు. దీంతో కొన్ని రోజులుగా నీటి కోసం అవస్థలు పడుతున్న గ్రామ ప్రజలకు ఊరట లభించింది. చేతిపంపు మళ్లీ పనిచేయడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించడంలో కీలక పాత్ర పోషించిన 'ప్రజాజ్యోతి' పత్రికను వారు అభినందించారు. 'ప్రజాజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు. "మా



గ్రామ ప్రజల సమస్యను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చేసిన 'ప్రజాజ్యోతి' దినపత్రికకు, ముఖ్యంగా కూనవరం విలేకరి కిరణ్‌బాబుకు



మా గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం" అని పొట్లవాయిగూడెం గ్రామస్తులు పేర్కొన్నారు.

# హామీల అమలులో మాట తప్పిన కూటమి

- పిఆర్సీ అమలు, సిపిఎస్ రద్దుపై చిత్తశుద్ధేది
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా విమర్శ.

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 31 (ప్రజాజ్యోతి)** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు విమర్శించారు. ఆదివారం సాయంత్రం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లయినా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లయిందని, అయినప్పటికీ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారం చేపట్టిన ఆరు మాసాలలోగా చెల్లిస్తామన్న ఆర్థిక బకాయిలు, రెండేళ్లయినా పూర్తి చెల్లింపులకు నోచుకోలేదన్నారు. కేవలం 9,500 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లించి, ఉద్యోగుల బకాయిలన్నింటిని చెల్లించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇంకా 30 వేల కోట్ల పైబడిన బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు



చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొద్ది మేరకు ఆర్థిక బకాయిల్ని చెల్లించినప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టకపోవడం తగదన్నారు. ఆర్థిక బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు. పాలకవర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారపక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చిన కూటమి పెద్దలు గద్దెనెక్కగానే ఉద్యోగుల సమస్యలను విస్మరించడం ఏంటని ప్రశ్నించారు. సకాలంలో డిఏలు చెల్లించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో ప్రశ్నించిన కూటమి పెద్దలు నేడు నాలుగు డిఏ లను పెండింగ్లో ఉంచడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న కూటమి నేతలు ఆ వైపుగా ఒక్క అడుగు కూడా వేయకపోవడం దుర్మార్గమన్నారు. కరోనా మహమ్మారితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఉన్న వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులు లేవన్నారు. ప్రభుత్వం జారీచేసిన హెల్త్ కార్డులు చెల్లని రూకలా ఉన్నాయన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు ఆదేశాలపై పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని, జూన్ మాసంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, జె.వి.సుబ్బా రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నేల బెలుం మల్లేశ్వర స్వామివార్లకు పౌర్ణమి సేవలు



**బనగానపల్లె :మే=31 ప్రజాజ్యోతి** బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలం బందార్ల పల్లె గ్రామ సమీపంలో గల నేల బెలుం శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వాళ్లకు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. ఆలయ అర్చకులు రవి స్వామి ఆధ్వర్యంలో నేలబిలుం శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు జేష్ఠ మాస పౌర్ణమి (అధికమాసం) పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల, అనంతపురం, కడప జిల్లా సరిహద్దుల్లో గల ఈ ఆలయానికి పౌర్ణమితో కూడిన ఆదివారం కావడం వల్ల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, శ్రీ భ్రమరాంబ దేవికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో వివిధ అర్చనలతో పాటు ఉయ్యాల సేవ కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. బందార్ల పల్లెకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రశాంత వాతావరణంలో ఆలయం శతాబ్దాల క్రితం నిర్మింపబడింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయానికి తగిన అభివృద్ధి లేకపోయినా ఆలయ పాలకమండలి మరియు భక్తుల ఆధ్వర్యంలో ఆలయ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కూనవరం మే 31 ( ప్రజా జ్యోతి)** మండలంలోని కూనవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003 -2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బాపూజీ సార్, బాలరాజు సుధాకర్ రమేష్ బాబు రత్నాకర్ రూప శ్రీ ఆదినారాయణ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు బాపూజీ సార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్య భోజనం కేవలం పాఠ్యాంశాలకు డిగ్రీపట్టాలకు సర్టిఫికెట్లకు పరిమితం కాకుండా జ్ఞాన విజ్ఞాన సహితంగా విద్య బోధన జరిగితే జీవితంలో ఉన్నత స్థానాలకు రాణిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలో మధురమైన అనుభూతులను జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిధులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పద్దయ్య బాలు వెంకటేశ్వర్లు వినయ్ గౌతమ్ వెంకన్న సౌజన్య సంధ్య మాధవి లలిత స్వాతి పాల్గొన్నారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శాశ్వత మాస కల్యాణమునకు 100,116 విరాళం




**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి మే 31** మండల కేంద్రంలోని భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మాస కళ్యాణ మహోత్సవమునకు బెంగుళూరు టౌన్ జి. విజయ్ కుమార్ ధర్మపత్ని జయంతి మరియు వారి కుటుంబ సభ్యులు కార్తీక శుద్ధ ద్వాదశి రోజున శాశ్వత మాసకళ్యాణము జరిపించుటకు నిశ్చయించి ఒక లక్ష నూట పదహారు రూపాయలు చెల్లించారు. వీరికి మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి అనుమతి మేరకు మేనేజరు ఈశ్వరయ్య చారి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది ఆదాని వెంకట నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నవనిర్మాణ సంకల్ప సభ జయప్రదం చేయాలి : హరీష్ బాబు

తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ




**పోడూరు, (ప్రజాజ్యోతి), - మే -31 :** జూన్ రెండో తేదీన తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న నవనిర్మాణ సంకల్ప సభ జయప్రదం చేయాలని పోడూరు మండల జనసేన అధ్యక్షుడు రావి హరీష్ బాబు అన్నారు. ఆచంట నియోజకవర్గం పోడూరు మండలం గుమ్ములూరులో ఆదివారం జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్ బాబు ఆధ్వర్యంలో అధ్యక్షులు తెలంగాణ నవనిర్మాణ సంకల్పం సభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లాల సెక్రెటరీ చిట్టూరి శ్రీనివాస్, గ్రామ జనసేన ఉపాధ్యక్షులు కొత్తలంక విజయ్, జనసేన నాయకులు కడలి శ్రీను, ఆరేటి హరికృష్ణ, బండి రాజు, తోట సాయిబాబా తదితరులు మాట్లాడుతూ సభ విజయవంతానికి కృషి చేయాలని, జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యచరణ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆచరణీయం కావాలని కోరారు.

# మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి పర్యటన వివరాలు




**బనగానపల్లె:మే=31 ప్రజాజ్యోతి** నేడు మంత్రి బీసీ. జనార్ద నరెడ్డి ఉదయం 8:30 గంటలకు సంజమల మండలం ముదిగేడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపి ణీ మరియు నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు ప్రార ంభో త్సవ కార్య క్రమాల్లో పాల్గొం టారు. కాబట్టి, ఈ కార్యక్ర మానికి ఎన్ డి ఎ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిఆయన మనవి చేశారు.

# పలు వైసీపీ నాయకుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు

కొన్నామాజీఎమ్మెల్యే కాటసాని



**కోవెలకుంట్ల:మే=31 ప్రజాజ్యోతి** కోవెలకుంట్ల పట్ట ణానికి చెందిన వైఎస్సా ర్సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి,ఎత్తపు చంద్ర శేఖర్ రెడ్డి,డాక్టర్ శివారెడ్డి గారిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కొన్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన వెంట.సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి,భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, అమడాల భాస్కర్ రెడ్డి,అంబటి రవి రెడ్డి, చిక్కెపల్లి ప్రసాద్ రెడ్డి,అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాజీవ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

– ముగితి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బజారమ్మ



**నందవరం మే 31 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలో ముగితి గ్రామ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బజారమ్మ, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారని ముగితి గ్రామ అధ్యక్షులు బజారమ్మ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందవరం మండలం ఆయా గ్రామాలలో నుండి 500 మంది దాకా బైక్ ర్యాలీతో వచ్చి గజమాలతో సత్కరించారు. ఎర్రకోట సైన్యం అంటేనే నియోజకవర్గ అభివృద్ధి పదాత మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి నియోజకవర్గం సమన్వయకర్తగా ప్రజలలో ఈ సమస్య వచ్చినా వెన్నంటే ఉండి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందవరం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు కనకవిడు లక్ష్మి కాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, వైఎస్ఆర్సిపి యూత్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# వసంతవాడ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 విజేత వేలేరుపాడు టీమ్




**వేలేరుపాడు :31 మే వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్)** వసంతవాడ గ్రామం లో వసంతవాడ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 టోర్నమెంట్ కి పూరేం రమేష్ శ్రీమతి లావణ్య దంపతుల కుమారుడైన పూరేం డియన్స్ శ్రీ హర్ష (ధోని ) పుట్టినరోజు వేడుకల సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ 31-05-2026 న ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరిగింది, ఈ మ్యాచ్ లో రెండు జట్లు వసంతవాడ,వేలేరుపాడు రెండు జట్లు తలపడగా విజేత గా వేలేరుపాడు జట్టు విజయం సాధించింది, వసంతవాడ టీమ్ రన్నరప్ గా నిలిచింది,ఈ టోర్నమెంట్ కి స్పాన్సర్ చేయబడిన పూరేం రమేష్ శ్రీమతి లావణ్య, పూరేం వెంకటేశ్వర్లు విజయ దంపతులు హాజరవడం జరిగింది. ఈ టోర్నమెంట్ కి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్రం నుండి సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా దయానంద విజయ్ కుమార్ చేతుల మీదుగా వేలేరుపాడు జట్టుకు కప్ అందించి క్రీడాకారులను అభినందించారు, ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి మంచిదని ప్రతి ఒక్కరు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు,ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మండల సర్పంచులు, దమ్మపేట మండల సర్పంచ్ లు,ఖమ్మం జిల్లా ఆదివాసీ నాయకులు కిసారి రాంబాబు, తెలంగాణ రాష్ట్రం నుండి కాంగ్రెస్ నాయకులు ఊకే రమేష్(కరాటే మాస్టర్), ఊకే కన్నారావు, ఊకే శివ, జానికిరామ్, మడకం రాజేష్, జల్లి పల్లి వాసు, కావేటి అప్పారావు, పాల్గొనడం జరిగింది, బంధుమిత్రులు, క్రీడాకారులు, అభిమానులు మరియు వసంతవాడ మాజీ సర్పంచ్, వార్డ్ మెంబర్స్ గ్రామ పెద్దలు, కమిటీ మెంబెర్స్, మరియు భారీ సంఖ్య లో క్రికెట్ అభిమానులు పాల్గొనడం జరిగింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక వేదిక



బాపట్ల మే 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు, తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు నేరుగా సమర్పించవచ్చన్నారు. గతంలో అందిన అర్జీల పరిష్కార స్థితిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదుల వివరాలను టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని, మీకోసం పోర్టల్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఆయన కోరారు.

# ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్





చైర్మన్ ఎరుబోతు రమణారావు గారు మాట్లాడుతూ, విజయవాడ నగరంలోని ఏ.వి.ఎస్ రోడ్డు, డాక్టర్స్ కాలనీలో నాగవంశీయుల కోసం సుమారు 476 గజాల విస్తీర్ణంలో ఉన్న కళ్యాణ మండప స్థలం ప్రస్తుతం చిన్నచిన్న కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పూర్తి స్థాయి ఆధునిక సౌకర్యాలతో కూడిన ఏ.సి నాగవంశం కళ్యాణ మండప నిర్మాణం కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగవంశీయుల ఐక్యతకు, సామాజిక కార్యక్రమాలకు, భావితరాల అవసరాలకు ఉపయోగపడే విధంగా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పూర్తి స్థాయి నాగవంశం కళ్యాణ మండపాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మహత్తర లక్ష్య సాధనకు ఉమ్మడి కృష్ణాజిల్లాల నాగవంశీయులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాగవంశం కుల పెద్దలు, దాతలు, యువతీ యువకులు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చైర్మన్ పిలుపుకు విశేష స్పందన లభించగా, కార్యక్రమంలో పాల్గొన్న నాగవంశం కుల పెద్దలు, నాయకులు, కమిటీ సభ్యులు ఉదారంగా విరాళాలను ప్రకటించారు. విరాళాలు ప్రకటించిన వారిలో ఎరుబోతు రమణారావు రూ.10 లక్షలు, కంటుభుక్త రామానాయుడు రూ.2 లక్షలు, మద్దిల శ్రీనివాసరావు రూ.1 లక్ష, బొడ్డు అప్పలనాయుడు రూ.1 లక్ష, తమ్మిన గణేష్ రూ.1,01,116, నామాల కాంతారావు రూ.1 లక్షతో పాటు వధూవరుల గదుల నిర్మాణ బాధ్యత, అప్పరుబోతు రాము రూ.1 లక్ష, మునికృష్ణ రూ.1 లక్ష, బెవర ఆది రూ.1 లక్ష, హనుమంతు త్రినాథ్ రూ.1 లక్ష, బెవర శంకరరావు (కంకిపాడు) రూ.1 లక్ష, బెవర రాము రూ.60 వేలు, మొకర ఆదిబాబు (నాగవంశం డైరెక్టర్) రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. వీఅదేవిధంగా నిర్మాణ సామగ్రి రూపంలో కాళ్ల రమణ (భరత్) 350 సిమెంట్ బస్తాలు, బోని రమణ 200 సిమెంట్ బస్తాలు, కాళ్ల సత్యం, కాళ్ల ఆదిబాబు, మొకర శ్రీనివాసరావు, పందిరి రాము, బుగత శ్రీరాములు, మొకర సోమినాయుడు, నల్లి రామరాజు, వెంపటాపు దుర్గాప్రసాద్ తలా 100 సిమెంట్ బస్తాలు, మద్దిల శివ, బెవర ఆనంద్, గాడు గణేష్ (భవానిపురం), బెవర గౌరీనాయుడు, తాలాడ చిన్న సూర్యనారాయణ, అవనాపు విష్ణు, తాలాడ కృష్ణ, కాళ్ల ఈశ్వరరావు, దాసరి సన్యాసిరావు కుమారుడు తలా 50 సిమెంట్ బస్తాలను అందజేస్తామని ప్రకటించారు. అలాగే బెవర చంద్రరావు రెండు టన్నుల ఇనుమును విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న నాగవంశీయులు కళ్యాణ మండప నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేసి, నాగవంశీయులందరికీ ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# ఏకగ్రీవంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నాగవంశం సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక





– ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు

– నాగవంశీయుల సంఘటితంగా ఉంటేనే సమాజంలో గుర్తింపు, గౌరవం

– నూతన కమిటీలు నాగవంశం అభివృద్ధికి కృషి చేయాలి : ఎరుబోతు రమణారావు

**విజయవాడ , ప్రజాజ్యోతి న్యూస్:** ఉమ్మడి కృష్ణాజిల్లా నాగవంశం సంక్షేమ సంఘం నూతన కమిటీల ఎన్నిక ఏర్పాటు సభ విజయవాడ సన్ లైట్ హోటల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, అడ్ హక్ కమిటీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నాగవంశం కమిటీకి అధ్యక్షునిగా బెవర రాము ,ప్రధాన కార్యదర్శి గా తమ్మిన గణేష్ , కోశాధికారిగా కాళ్ళ సత్యం, అలాగే కృష్ణాజిల్లా నాగవంశం కమిటీకి అధ్యక్షుడిగా బేవర చంద్రరావు ,ప్రధాన కార్యదర్శిగా రాబిల్లి శ్రీను ,కోశాధికారి గా నల్లి రామరాజు లు నూతనంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎరుబోతు రమణారావు , కంటుభుక్త రామానాయుడు, సంఘ పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ముఖ్య అతిథిగా విచ్చేసి నటువంటి ఎరుబోతు రమణా రావు ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుబోతు రమణా రావు మాట్లాడుతూ, నాగవం శీయులు సంఘటితంగా ఉంటే సమాజంలో మరింత గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. అదేవిధంగా నూతన కమిటీలు నాగవంశీయుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుకై



ప్రభుత్వానికి , నాగవంశీయులకు మధ్య వారధిగా పని చేయాలని సూచించారు. నాగవంశం సామాజిక వర్గ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, నాగవంశం సంఘ పెద్దలు, పెద్ద సంఖ్యలో నాగవంశీయులు పాల్గొన్నారు.

# జూన్ 5 న సిరాల దొడ్డి లో డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**కరపత్రములను విడుదల చేసిన ఎమ్మార్పీఎస్, కెవిపిఎస్ నాయకులు**

**మే 31 (ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు ప్రతినిది)** జూన్ 5 న ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరు మండలం, సిరాల దొడ్డి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం ఆవిష్కరణ చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, దళిత రచయితల సంఘం (దరసం) వ్యవస్థాపక అధ్యక్షులు అరెకంటి భాస్కర్, కెవిపిఎస్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు సప్పోగు తిమ్మన్న తెలిపారు. ఆది వారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ కరపత్రంలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం పూర్తిగా ఎమ్మిగనూరు డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి భాగస్వాములైన కెవిపిఎస్, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, బేడ,బుడగ జంగం హక్కుల పోరాట సమితి, ఎరుకల హక్కుల పోరాట సమితి, దళిత రచయితల సంఘం (దరసం), ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసిసి), మాల దాసరి హక్కుల పోరాట సమితి ల ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. ఈ కార్య క్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు దళిత ప్రజా సంఘాల నుండి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సప్పోగు దేవసహాయం, ఏఐ సిసి రాష్ట్ర కార్యదర్శి డా.మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు,కె విపియస్ జిల్లా



ప్రధాన కార్యదర్శి యం.డి.ఆనంద్ బాబు, మహాజన సోషలిస్టు పార్టీ (యం.యస్.పి.) జిల్లా అధ్యక్షులు యస్.సుభాష్ చంద్ర మాదిగ, డా.బి.ఆర్ . అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదె న్న, బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.ఎర్రకోట సంకుల మహాలింగప్ప బుడగ జంగం, ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షులు మాల మధు బాబు పలువురు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నలుమూలల నుండి దళిత గిరిజనులు, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.బెళగల్ రాజు, కె.వి.పి.యస్.నాయకులు సూమాల అంతోని, కోటేకల్ చిన్నప్ప, కలుగొట్ల మాల రాజా రమేష్, గుడికల్ మాల ఆనంద్, మాచాపురం మాల గంగన్న, దళిత చర్మ కారుల సంఘం నాయకులు సుమాల రాజు,వెంకటాపురం గుంటేప్ప తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు పట్టణం లోగల రోడ్లు ఇకనైనా బాగుపడేనా

**గోపవరం మే 31 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ గోపవరం మండలాలు కలిసి టౌన్ గా ఏర్పడిన ఈ ప్రాంతంలో రోడ్ల పరిస్థితి చాలా అధ్వాన పరిస్థితి ఏర్పడి ఉన్న కారణంగా .ఆదివారం బద్వేలు పట్టణం నందుగల ఆర్.టి.సి మజ్దూర్ యూనియన్ కార్యాలయం లో జరిగిన బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటి కార్యవర్గ సభ్యుల సమావేశంలో అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడి 15 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ నేటికీ పట్టణం లో మట్టి రోడ్లలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం బద్వేలు పట్టణ మౌళిక సదుపాయలు మరియు సుందరీకరణ కొరకు సుమారు 200 కోట్ల రూపాయల నిధులు ఇవ్వడమైనదని ఈ నిధులతో అయినా బద్వేలు లోగల పాలక పార్టీల నాయకులు సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా నిధులు దుర్వినియోగం కాకుండా పట్టణంలోని వీధుల రోడ్ల ఆక్రమణలను తొలగించి రోడ్లు వేసి డ్రైనేజీలు,విద్యుత్ దీపాలు,పారిశుధ్యం,త్రాగునీరు లాంటి మౌళిక సదుపాయాలు ప్రజలకు కల్పించాలని,అలాగే పార్కు,లైబ్రరీ కొరకు, నాగులచెరువు కట్టను ఉపయోగిస్తే బాగుంటుంది చెరువును పరిశుభ్రపరచి మధ్యలో సుందరీకరణకై గౌతమ బుద్దనీ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు . పట్టణం లోగల సిద్దవటం రోడ్డు నందు పట్టణ ప్రజలకు పందుల,కుక్కల బెడద మరియు దుర్వాసన వెదజల్లుతున్న చికెన్,మటన్ షాపులను వేరేచోటకు తరలించాలని అలాగే ఫ్యామిలీ ఉండే ఇళ్ల మధ్య ప్రతి వీధికి మొదట ఉండే చికెన్ షాపులను తీసి వేరే చోటికి మారిస్తే. టౌన్ పరిశుభ్రత దృష్టిలో ఉంచుకొని .చికెన్ షాపులని ఒకే చోట ఉండేలాగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరారు.ప్రధాన కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాటాడుతూ పట్టణం లోగల బద్వేలు సిద్దవటంరోడ్డు, మైదు కూరు రోడ్డు,నెల్లూరు రోడ్లలోని ఆక్రమణలను,విద్యుత్ స్తంభాలను తొలగించి ఆర్.అండ్.బి స్థలం వరకూ రోడ్లను వెడల్పు చేసి ప్రజల ట్రాఫిక్ ప్రమాదాలను నివారించుటకు సంబంధిత అధికారులు వెంటనే చేపట్టాలన్నారు. పట్టణంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల, సిబ్బంది కొరత నివారించి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయముల పూర్తిగా అందేటట్లు మరియు పట్టణంలో పేద విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బి.సి బాలుర సంక్షేమ వసతిగృహం శిధిలావస్థలో వున్నందున దాన్ని వెంటనే నూతన నిర్మాణములు ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధిక కై పాలకులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం మునిసిపాలిటీ పరిధిలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల కార్యక్రమానికి సహాయ సహ కారములు అందించిన సబ్రిజిస్ట్రార్ సాకె ఈశ్వరయ్య, అడ్వకేట్ మురళీకృష్ణ,ఉపాధ్యాయులు పి.వి రమణయ్య గార్లను శాలువాతో,మెమెంటోలతో సత్కరించడమైనది.ఈ కార్య క్రమంలో పట్టణ అభివృద్ధి సొసైటి కోశాధికారి పి.శ్రీనివాసుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.ఎ సత్తార్,జి.నాగార్జున, కార్యవర్గ సభ్యులు ఆవుల వెంకట్, ట్రావెల్స్ రసూల్, మస్తానయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ నుండి విసన్నపేట వరకు బీటీ రోడ్





**జి.కొండూరు :(మే 31,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడ నుండి వెలగలేరు మీదగా విసన్నపేట 60 కిలోమీటర్ల వరకు బీటి రోడ్డును అలాగే గ్రామాల్లో సిసి రోడ్లను ఎస్సి పి య ల్ వారు నూతన రోడ్లు నిర్మిస్తూ ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు,రైతులు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం పలువురు గ్రామ ప్రజలు పత్రికా ముఖంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో ఈ రహదారి గుంటల పడి అద్వానంగా మారిందని, ఈ రహదారుల ప్రయాణించాలంటే ప్రయాణికులు పలు వాహనదారులు భయపడిపోయారన్నారు. ప్రధానంగా ఈ రహదారిలో ఇటుక బట్టి వాహనాలు,ఎర్రమట్టి,క్వారీ వాహనాలు భారీ వాహనాలు ప్రతినిత్యం తిరుగుతుండడంతో రహదారి పెద్ద పెద్ద గుంటల పడి ఆ గుంటలో ద్విచక్ర వాహనాలు పలు అనేక ప్రమాదాలు జరిగిన పరిస్థితులు లేకపోలేదన్నారు.ఇప్పటికే ఈ రహదారుల్లో ఎస్సి పి యల్ కంపెనీ కాంట్రాక్టర్ గ్రామాల్లో లెఫ్ట్ మూడున్నర మీటర్ల,రైట్ మూడున్నర మీటర్ల చొప్పున మొత్తం ఏడు మీటర్లు సిసి రోడ్లు నాణ్యతగా పటిష్టంగా నిర్మిస్తున్నారని అలాగే బీటీ రోడ్ 8 కిలోమీటర్లు చొప్పున నిర్మించేటందుకు రహదారిని క్లీన్ చేస్తూ పనులు వేగవంతం జరుగుతున్నాయని ఆయా గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ఆగకుండా బిల్లులు త్వరితగతిన మంజూరు చేయించి వర్షాకాలం వచ్చే లోపు రహదారిని నిర్మించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# పలు జాతర మహోత్సవాల్లో పాల్గొన్న





– కడప ఎంపీ అవినాష్ రెడ్డి

**దువ్వూరు,మే 31 (ప్రజా జ్యోతి)** దువ్వూరు మండలంలోని చిన్న శింగనపల్లె, మాచనపల్లె గ్రామాల్లో ఆదివారం జరిగిన దేవర కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి లు పాల్గొన్నారు.అమ్మవారులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల అధ్యక్షులు ఇరంగం రెడ్డి శంకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ కానాల జయచంద్ర రెడ్డి,సంఘన హరినాథ్ రెడ్డి, నారుపల్లె జగన్మోహన్ రెడ్డి మరియు మండల వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల హక్కుల పోరాట సాధన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం: పట్టణ అధ్యక్షురాలు పద్మ**





**గుంతకల్లు మే 31 (ప్రజా జ్యోతి):** ఆదివారం పట్టణంలోని రాజేంద్ర నగర్ లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యందు పట్టణ దివ్యాంగులు హక్కుల పోరాట సాధన సమితి నూతన కమిటీని ఒకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దివ్యాంగుల హక్కుల పోరాట సాధన కమిటీ గుంతకల్లు పట్టణ అధ్యక్షురాలుగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర, ట్రెజరర్ గా ఫోటోగ్రాఫర్ నీలకంఠ, ఉపాధ్యక్షులుగా శోభా, అశోక్, సహాయ కార్యదర్శులుగా షఫీ, ఆసియా బేగం, గౌరీ, కమిటీ సభ్యులుగా హైదర ఆలీ షాషావలి, జంగం శంకర్, వాల్మీకి మురళి లతోపాటు గౌరవాధ్యక్షులుగా మహమ్మద్ గౌస్, జవుపుల్లా ఖాన్, గౌరవ సలహాదారులుగా మేస్త్రి దొడ్డప్ప ను ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ పట్టణ అధ్యక్షురాలు పద్మ మాట్లాడు తూ దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఇక నుండి దశలవారీగా ఉద్యమి స్తామని హక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తామని పట్టణంలో చాలామంది దివ్యాంగుల కు ఇల్లు స్థలాలు గాని, ఇల్లు గాని లేవని అలాగే దివ్యాంగులు సమస్యలు పరిష్కరించు కోవడానికి చాలా మండల ప్రాంతాల్లో దివ్యాంగుల ఆఫీసు లు ఉన్నప్పటికీ గుంతకల్లు పట్టణంలో ఆఫీస్ లేకపోవడం బాధాకరమని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల మీద అవగాహన లేకపోవడం వల్ల వాటిని పొందలేకపోతున్నా రని వాటిని అర్హులకు అందే లా కృషి చేస్తామని దివ్యాం గులకు ఏ కష్టం వచ్చినా వారి పక్షాన నిలబడి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని, దివ్యాంగులను ఎవరైనా మోసం చేస్తుంటే వారికీ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తుంటే అలాంటి దొంగను మాకు పట్టి స్తే వారికి బహుమతిగా 1000 రూపాయలు అందజేస్తామని తెలిపారు.

# అంకితభావానికి అభినందనలు

– పదవీ విరమణ పొందిన ఎస్ఐకి ఎస్పీ సత్కారం



**బాపట్ల మే 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నాలుగు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో సేవలందించిన ఎస్ఐ మల్లవరపు శ్రీనివాసులు పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆయనను పూలమాల, దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. 1983లో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన శ్రీనివాసులు, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ఎస్ఐ స్థాయికి ఎదిగి 43 ఏళ్లపాటు శాఖకు సేవలందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఆయనకు 30 రివార్డులు లభించాయి.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా సేవలందించే అవకాశం పోలీస్ వృత్తిలోనే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ పొందుతున్న శ్రీనివాసులు ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, సీఐ వి. సూర్యనారాయణ, ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే అధికారి

కమిషనర్ రఘునాథరెడ్డికి ఎమ్మెల్యే
నరేంద్ర వర్మ రాజు ఘన సన్మానం



**బాపట్ల మే 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పురపాలక సంఘం కమిషనర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన జి. రఘునాథరెడ్డిని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి, పూలగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బాపట్ల పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో కమిషనర్‌గా అందించిన విశిష్ట సేవలను ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసి ప్రజల మన్ననలు పొందిన ఆయన సేవలు బాపట్ల ప్రజలకు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఉద్యోగ జీవితమంతా ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన జి. రఘునాథరెడ్డి, పదవీ విరమణ చివరి క్షణం వరకు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఉద్యోగ ధర్మానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని ఎమ్మెల్యే కొనియాడారు. బాపట్ల పట్టణాభివృద్ధిలో ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించేందుకు కృషి చేసిన అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.ఇలాంటి మంచి అధికారిని పదవీ విరమణతో వీడ్కోలు పలకడం బాపట్ల ప్రజలకు బాధాకరమే అయినప్పటికీ, ఆయన అందించిన సేవలు, చూపిన పరిపాలనా మార్గం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. పదవి ముగిసినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం శాశ్వతమని, బాపట్లకు చేసిన సేవలకు ప్రజలందరి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనకు ఆరోగ్యకరమైన, ఆనందమయమైన పదవీ విరమణ జీవితం కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# మురుగు రహదారితో... ముప్పు



**దువ్వూరు,మే31(ప్రజా జ్యోతి)** దువ్వూరు మండల కేంద్రంలో డ్రైనేజి వ్యవస్థ చాలా అధ్వానంగా తయారైంది.గంగమ్మ తల్లి దేవాలయంలో సమీపంలో డ్రైనేజీ నిండి మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి.రహదారి మధ్యలో నుంచే వాహనాలు,పాద చారులు వెళుతున్నారు.పాదచారులకు, వాహనదారులకు చాలా ఇబ్బంది కరంగా మారింది.గతంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ప్రభుత్వ స్థలం ఎంత వరకు ఉందో,సరిహద్దులు వేయండి అంటూ అప్పటి తహసీల్దార్ కి తెలిపారు.కానీ రెవిన్యూ సిబ్బంది నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహారించారు.ఆర్‌డబి అధికారి హద్దులు కోసం తహసీల్దార్ వినతిపత్రం ఇచ్చారు, కానీ రెవిన్యూ సిబ్బంది తూ తూ మంత్రంగా సర్వే చేశారు.అటూ పంచాయతీ అధికారులు ,ఇటు ఆర్‌డబి అధికారులు మనకెందుకు అన్నట్లు ఉన్నారు. నిమ్మకు నీరెత్తినట్లు పంచాయతి,ఆర్‌డబి అధికారులు వ్యవహరిస్తురని మండల ప్రజలు మండిపడుతున్నారు.పలుమార్లు పలు వార్త పత్రికల్లో ప్రచురణ చేసిన అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం.ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే త్వరగా అధికారులు,శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు,వాహనదారులు కోరుతున్నారు.

# ఘనంగా డాక్టర్ ఎం వి కోటిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం






హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు

ప్రముఖ వైద్యులు

**చింతూరు మే 31ప్రజాజ్యోతి** చింతూరు ప్రభుత్వ సిహెచ్ సి హాస్పిటల్ సూపరిన్ డెంట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోటిరెడ్డి ఈరోజు తన పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు డాక్టర్ కోటిరెడ్డి గత 30 సంవత్సరాలుగా ఏజెన్సీ ప్రాంతంలో తన నిస్వార్ధమైన సేవలను అందిస్తూ ప్రజల మన్నలను పొందారు తన మన అనే పారతమ్య భేదం లేకుండా ఆంధ్ర తెలంగాణ ఒరిస్సా చతీస్ గడ్ వంటి పక్క రాష్ట్రాల నుండి అనేకమంది రోగులు ఈయన ఉన్నాడు అనే ధైర్యంతో తరలివచ్చేవారు హాస్పిటల్ కి వచ్చిన వారితో మీకు నేనున్న మీకేం కాదు అని విశిష్ట సేవలు అందించి తనకంటూ ఒక గుర్తింపు ముద్రను సాధించిన గొప్ప మనసున్న మారాజు గా ప్రజల హృదయాలను గెలిచిన చింతూరు సూపర్డెంట్ డాక్టర్ కోటిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు భద్రాచలం ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్ రావు ఎస్ ఎల్ కాంతారావు డాక్టర్ విజయ రావు డాక్టర్ దేవరాజ్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి డాక్టర్ శేషారెడ్డి ఇంకా చాలామంది ప్రముఖ వైద్యులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగిస్తూ డాక్టర్ కోటిరెడ్డి ఎక్కడ ఉన్నా పేద ప్రజలకు సేవ చేయడంలో ముందుంటారని తను చేసిన సేవలను కొనియాడారు అలాగే వైద్యులు డాక్టర కోటిరెడ్డి తో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎన్నో దశాబ్దాలు గా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు గిరిజనేతరులకు తన మన అనే భారతమేధం లేకుండా తన నిస్వార్ధమైన వైద్య సేవలను అందిస్తూ తనతో మాట్లాడిన అందరిని చిరునవ్వుతో పలకరిస్తూ ఏ సమయంలోనైనా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన నేనున్నాను అనే ధైర్యం కలిగించే విధంగా మాట్లాడి ప్రజలకు ఉత్తమ సేవలందించే విధంగా ఆయన సేవలు ఏజెన్సీ ప్రజలకు చిరకాలం గుర్తుండే విధంగా ఏజెన్సీ ప్రజల గుండెల్లో మనసున్న మారాజు గా ముద్రపడిన డాక్టర్ కోటిరెడ్డి ఈ ప్రాంతం నుండి పదవీకాలం పూర్తి కావడంతో ప్రజలు ప్రముఖులు రాజకీయ నాయకులు వైద్యులు వైద్య సిబ్బంది పత్రికా విలేకరులు ఆయన చేసిన సేవలను గుర్తింపుగా శాలువాలతో చిత్రపటాలతో ఘనంగా సన్మానించారు ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు.

# మోదీ సర్కార్‌కు 'బొద్దింకల' బెదురు!

సర్వవ్యాపక జీవి బొద్దింక మన రాజకీయ పరిభాషలో భాగం కావడానికి చాలా కాలం ముందే అది నా పాత్రికేయ పదావళిలో ఒక భాగంగా ఉండేది. జర్నలిజంపై నా ప్రసంగాలలో నేను తరచు పాత్రికేయులను బొద్దింకలతో పోల్చుతూ ఉండేవాణ్ణి. ఎందుకు? రేపు, ప్రపంచం ఒక మహా అణ్వాయుధ దాడికి (అది సంభవించకుండా ఉండుగాక) గురైతే బతికి బయటపడే జీవి బొద్దింక ఒక్కటే కదా. మానవాళి విధ్వంసాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా నివేదించేందుకు ఎవరో ఒకరు తప్పనిసరిగా అవసరమమవుతారు. ఆ ఎవరో ఒకరు పాత్రికేయులు కాక మరెవరు? సమాజ సమస్యలను పరిష్కరించడంలో దేశ రాజకీయ వ్యవస్థ ఘోర వైఫల్యం పట్ల పెల్లుబుకుతోన్న ఆగ్రహావేశాలను 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆకస్మిక ఆవిర్భావం నిండుగా ప్రతిబింబించింది. పాలనను అవినీతిమయం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహరిస్తున్న భయానక అంధకారాన్ని ఎత్తిచూపేందుకు మురికి తావుల్లో నడయాడే కీటకం బొద్దింకను నిరసనకారులు ఒక ప్రతీకగా తీసుకున్నారు. పాలకులు అంతకంతకూ చక్రవర్తుల్లా ప్రవర్తిస్తున్న ఒక రాజకీయ విశ్వంలో మనం ఉన్నాం. అధికారాలను విచక్షణారహితంగా చెలాయిస్తున్న పాలకులను గట్టిగా ఎదుర్కోలేనిరీతిలో ప్రతిపక్షం చీలిపోయి ఉన్న రాజకీయ విశ్వమది. ఈ వికృత రాజకీయ విశ్వంలోకి బొద్దింక పాకుకుంటూ వచ్చింది. అసహ్యకరమైన కీటకాన్ని చిహ్నంగా స్వీకరించిన ఒక అసాధారణ వ్యంగ్య నిరసన ఉన్నపాటున ఒక ఉద్యమంగా పరిణమించింది. సుదూర అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక అజ్ఞాత రాజకీయ సందేశ వ్యూహకర్త ఈ ఉద్యమాన్ని ఆరంభించి భారతదేశ అధికార నడవాలలో ప్రకంపనలు సృష్టించాడు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన (పూర్తిగా అనవసరమైన) 'బొద్దింక' వ్యాఖ్యలు పురికొల్పిన ఆన్‌లైన్ వేలం వెర్రి ప్రపంచ అతి పెద్ద రాజకీయ పార్టీ, మహాశక్తిమంతమైన భారత రాజ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపరిచింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా 'కొంతమంది యువకులు ఉద్యోగాల్లేక, చేస్తున్న పనిలో గుర్తింపు లేక బొద్దింకల్లా అన్ని చోట్లకు విస్తరిస్తున్నారు. వారు మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థలపై దాడి చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక డిజిటల్ తిరుగుబాటుకు దారి తీశాయి. ఆగ్రహం ఆ తిరుగుబాటును ఉసిగొల్పగా వ్యంగ్యం దానికి అసాధారణ శక్తినిచ్చింది. సీజేపీ ఒక రాజకీయ పార్టీ కూడా కాకపోవడం ఈ బొద్దింకల ఉద్యమాన్ని మరింత ఆకర్షణీయమూ, ఆసక్తిదాయకమూ చేస్తోంది. దానికొక నాయకుడు లేడు, ఇంచుమించు 150 కోట్ల ప్రజలతో అపార వైవిధ్యాలతో అలరారుతున్న దేశంలో చాలావరకు సైబర్ స్పేస్‌లోనే జరుగుతున్న ఉద్యమం యథాతథ పరిస్థితులకు ముప్పు కాబోదు. అయినా నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనా వ్యవస్థ సీజేపీ గురించి ఎందుకు అంతగా ఆందోళన చెందుతోంది? విదేశీ నిధులతో జరుగుతున్న ఉద్యమమని సీజేపీని మోదీ ప్రభుత్వ మంత్రులు విమర్శించారు. దాని అనుయాయుల్లో చాలా మంది పాకిస్థాన్‌లో ఉన్నారని మోదీ సర్కార్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు అవరోధాలు కల్పించారు. వాటిని తమ ఆన్‌లైన్ దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు సీజేపీ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ పరోక్ష ప్రమేయమున్నదని పలువురు ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమాలలో పనిచేసినవాడు కావడమే ఆ ఆరోపణకు ఆధారం. అధికారపక్షంలో ఈ ఆందోళనకు నాలుగు కారణాలు ఉన్నాయి. మొదటిది-- తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయ కథనాల నియంత్రణపై పెద్ద ఎత్తున ఆధారపడిన ప్రభుత్వం మోదీ సర్కార్. దాని పాలన రేయింబవళ్ల వాణిజ్య ప్రచారంలా సాగుతోంది: విజయాలను ఘనంగా చెప్పుకోవడం, వైఫల్యాలను పూర్తిగా కప్పిపుచ్చడం, సరికొత్త నినాదంతో ముందుకు సాగడం. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి ఒక స్వప్నంగానే మిగిలిపోయింది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావడమనేది జరగనే లేదు. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఆగనే లేదు. అయినా ప్రభుత్వ అధ్వాన పనితీరును పాలకుల కథనాలు పూర్తిగా కప్పిపుచ్చుతున్నాయి. అయితే ఇంటర్నెట్ బొద్దింకలు ఈ




ప్రభుత్వ కథనాలను విశ్వసించేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఈ తిరస్కారమే ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరుస్తోంది. రెండోది-- యువత ఆగ్రహం. ఎన్నికలలో జయాపజయాలను అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. జీడీపీ అంకెలు పతాక శీర్షికలవుతున్నాయి. జాతీయవాద భావోద్వేగాలు ఉధృతమవుతున్నాయి. అయినా ఒక అంతులేని అభద్రతా భావంతో నేటి తరం సతమతమవుతోంది. లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. పరీక్షల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి అస్తుబిస్తుగా ఉన్నది. యువ భారతీయులలో నెలకొన్న అసంతృప్తి నైరాశ్యంలోకి జారిపోతోంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు శ్రద్ధ చూపడం లేదన్నది యువత ప్రధాన ఆరోపణ. వారి ఆగ్రహం భావజాలపరమైనది మాత్రమేకాదు, పూర్తిగా వ్యక్తిగతమైనది కూడా. ఇది ఇటీవలి ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. ముఖ్యంగా తమిళనాడులో విజయ్ రాజకీయ సంచలనంలో సంప్రదాయ రాజకీయాల పట్ల యువ ఓటర్ల అసహనం పూర్తిగా ప్రతిబింబించింది. దేశవ్యాప్తంగా యువ ఓటర్లు అంతకంతకూ కాలం చెల్లిన రాజకీయ ద్వంద్వాల -- వామపక్షాలు వర్సెస్ మితవాద పక్షాలు, ఉన్నత వర్గం వర్సెస్ ప్రజాకర్షక వాదం,--ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. భవితనిచ్చే నవ్యత, వాస్తవికత, భావోద్వేగ బాంధవ్యాలకోసం వారు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా విశాల, విస్తృత సమూహాలను సమీకరించే మీమ్ సంస్కృతి వారి నిరసనను వ్యక్తం చేసే భాషగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీకి ప్రాణవాయువుగా ఉన్న ఈ మీమ్ సంస్కృతి, బహుశా ఆ పార్టీకి సంబంధించి చాలా తక్కువగా అర్థం చేసుకున్న విషయమని విశదమవుతుంది. వ్యంగ్యం ఒక రాజకీయ ఆయుధమయింది. నిరంకుశ పాలనా వ్యవస్థలు ఆశ్చర్యకరంగా తరచు ఈ పదునైన శస్త్రాన్ని నెదుర్కోలేక ఆత్మరక్షణలో పడుతుంటాయి. ప్రతిపక్షాల ప్రసంగాలు, టెలివిజన్ చర్చలు, ఆగ్రహ సంపాదకీయాలను అవి సంబాళించుకుంటాయి. ఎందుకంటే అవి సుపరిచితమైన సమరాస్త్రాలే. అయితే పరిహాసాన్ని తట్టుకోవడం చాలా కష్టం. దానిని అణచివేయడం మరీ అసాధ్యం. ఒక పత్రికా ప్రకటన కంటే ఒక మీమ్ వడివడిగా విస్తృత ప్రభావాన్ని నెరపుతుంది. మీమ్ ది కాంతివేగం! చాలా జాగ్రత్తగా పెంపొందించుకుని పటిష్ఠం చేసుకున్న పేరు ప్రతిష్ఠలను ఒక ఎత్తి పొడుపు లేదా పరుషోక్తి ఒక క్షణంలో కూల్చివేస్తుంది. పరిహాసానికి పవిత్ర వస్తువు అనేది ఏమైనా ఉంటుందా? ఉండదు. అధికారం ఎప్పుడైతే ఎగతాళికి గురవుతుందో అప్పుడే దాని ప్రాభవ కాంతులు మసకబారడం ప్రారంభమవుతుంది. మూడోది-- సీజేపీ ఘోషించిన అంశాలన్నీ ప్రగాఢంగా ప్రతిధ్వనిస్తున్నాయి: పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగిత; ప్రశ్న పత్రాల లీక్‌లు; పాదుకుపోయిన అవినీతి; అనైతిక పార్టీ ఫిరాయింపులు; ఆప్తులు, ఆశ్రితులు, ఆస్తిపరుల ప్రయోజనాల పరిరక్షణకే పాలనా వ్యవస్థ ప్రాధాన్యమివ్వడం మొదలైనవి. ఈ 'బొద్దింకల' ఉద్యమం ఒక గందరగోళ వ్యవహారంగా కనిపించవచ్చు; అప్పుడప్పుడూ ఆదర్శాల ఆరాటం లేదా నైరాశ్యాల నిరుత్సాహంలో ఉన్న కుర్రకారు కదన కాహళిగా విన్పించవచ్చు గానీ అది అసంఖ్యాక యువత నిజమైన ఆందోళనలే ఆధార భూమికగా ఉన్న అపూర్వ ఉద్యమమది. యువతను పీడిస్తున్న వ్యాకులతలను తొలగించడంలో ఘోరంగా విఫలమైన సంప్రదాయ రాజకీయాలను నిరసిస్తున్న పెనుకేక అది. నాల్గవది-- అంతకంతకూ బలపడుతోన్న ప్రతి నిరంకుశ పాలనా వ్యవస్థ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేక చర్యగా చట్టవిరుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తుంది. విమర్శను అసమ్మతిగా భావించడానికి బదులు ఒక కుట్రగా పరిగణిస్తుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ క్రమంగా కుదించుకుపోతూ చివరకు వ్యంగ్య వ్యాఖ్యలను సైతం తన మనుగడకు ముప్పుగా చూడడం ప్రారంభమవుతుంది. ఇదిగో, ఇటువంటి సందర్భాన్నే సీజేపీ సృష్టించింది. ప్రధాన స్రవంతి భావవ్యక్తీకరణ మార్గాలను మూసివేస్తే యువత అనివార్యంగా తమ అసమ్మతిని మరింత అంతరాయం కలిగించే విధ్వంసక పద్ధతులలో వ్యక్తం చేసేందుకు తప్పక పూనుకుంటారు. ఈ దృష్ట్యా, అసహన పాలనా వ్యవస్థ తనకు తానుగా సృష్టించుకున్న తిరుగుబాటు వేదికే కాక్రోచ్ జనతా పార్టీ. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ 'బొద్దింకల' ఉద్యమ ఉత్థానంలో ప్రతిపక్షానికీ ఒక హెచ్చరిక ఉన్నది. ఆగ్రహావేశాలు యువ భారతాన్ని సంపూర్ణంగా ఆవహించి ఉన్న తరుణమిది. అయితే ఆగ్రహం దానికదే ఒక రాజకీయ మార్పుగా పరిణమించదు. యువ భారతీయుల నిరాశానిస్పృహలను ఒక నిర్మాణాత్మక మార్గంలోకి మళ్లించేందుకు ప్రతిపక్షాలు వివేకవంతంగా సంఘటితమవ్వాలి. విపక్షాలు అలా ఒక వివేకశీల వేదికగా ఏర్పడనంతవరకు యువత శక్తిసామర్థ్యాలు ఒక విస్తృత ప్రజాస్వామిక ఉద్యమంగా ప్రభవించడానికి బదులు మీమ్‌లు, ఆన్‌లైన్ తిరుగుబాటులోనే చిక్కుకుపోతాయి. నేపాల్‌లో జెన్ జడ్ తిరుగుబాటుకు సమాంతరమైనదిగా సీజేపీని చూస్తున్నవారు ఒక వాస్తవాన్ని గుర్తించాలి: పట్టుమని మూడు కోట్ల మంది ప్రజలు కూడా లేని దేశంలో ఉవ్వెత్తున ఎగసిన తిరుగుబాటు తుఫాను ఇంచుమించు 150 కోట్ల జనాభాతో విస్తారంగా సామాజిక, రాజకీయ సంకీర్ణతలు పరిఢవిల్లుతోన్న భారతీయ సమాజంలో చెలరేగడం అసాధ్యం. కాక్రోచ్ జనతా పార్టీగా సంఘటితమవుతోన్న నేటి యువతకు ఒక సంస్థాగత ఉనికి, భావజాలం లేదా వనరులు లేకపోవచ్చు కానీ వారికి అసాధారణ శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. సృజనాత్మకత, ఆధిపత్య శక్తుల పట్ల గౌరవ భావ రాహిత్యం, అధికారాన్ని అపహసించే నిర్భీకత వారి సహజ సొత్తులు. బీజేపీ లాంటి శక్తిమంతమైన రాజకీయ సంస్థలు తమ సంప్రదాయ ప్రత్యర్థులను నిర్దయగా ఎదుర్కొని, అణచివేయడం పరిపాటి. అయితే స్పష్టమైన నాయకత్వం, ఒక కేంద్ర కార్యాలయం, మరీ ముఖ్యంగా కోల్పోవడానికి ఏమీలేని వికేంద్రీకృత తిరుగుబాటు ఉద్యమాలతో తలపడడమనేది ఒక కొత్త, వేరు విషయం. ఇదే మోదీ ప్రభుత్వ అసలైన బొద్దింకల సమస్య.

# పార్టీ కార్యకర్తకు ధైర్యం చెప్పిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి



**బాపట్ల మే 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పార్టీ కార్యక్రమంలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తను పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం పరామర్శించారు. ఖమ్మంలోని స్తంభాద్రి ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే, ఇటీవల డిజిటల్ మహానాడు కార్యక్రమం సందర్భంగా గాయపడిన బైరు అప్పారావును కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను వైద్యులను అడిగి తెలుసుకుంటూ, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా అప్పారావుతో కొంతసేపు మాట్లాడిన ఏలూరి సాంబశివరావు, ఆయన ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త సంక్షేమం తమకు ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవడం పార్టీ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా తెలుగు యువత నాయకులు వక్కంతుల వంశీ, కన్నీటి పృథ్వి, మల్లెంపాటి రాము, నాగండ్ల లక్ష్మణ్, చైతన్య తదితరులు పాల్గొని అప్పారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎటుపోతున్నాయి

**నంద్యాల:మే=31ప్రజాజ్యోతి**






నంద్యాలలో ఉద్రిక్తత.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం వైఎస్సార్ విగ్రహ ధ్వంసంపై నోరు విప్పని కూటమి ప్రభుత్వం ఘటనా స్థలానికి రాని ఉన్నతాధికారులు.. వైసిపి శ్రేణుల తీవ్ర ఆగ్రహం దీ నిందితులపై, వారి వెనుక ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్! నంద్యాలలో తీవ్ర కలకలం రేగింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అయితే, ఇంత పెద్ద దుర్ఘటన జరిగినా కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు నోరు విప్పకపోవడం శోచనీయంగా మారింది. అసలు ఈ ఘటన వెనుక ఉన్నవారెవరు? పోలీసులు ఏం చేస్తున్నారు. ప్రజాదరణ పొందిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నడిరోడ్డుపై ధ్వంసం చేస్తుంటే రక్షణ కల్పించాల్సిన యంత్రాంగం ఏం చేస్తోంది? నంద్యాలలో జరిగిన ఈ దారుణ ఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేసిన దుండగుల చర్యపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇంతటి ఘోరం జరిగినా.. కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం, ఈ ఘటనను ఖండించకపోవడంపై ప్రజలు, వైసిపి శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసు అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు! ఈ ఘటనలో స్థానిక పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున విగ్రహ ధ్వంసం జరిగి, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా.. పోలీస్ ఉన్నతాధికారులు కనీసం ఘటనా స్థలానికి రాకపోవడం గమనార్హం. పరిస్థితిని సమీక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై లేదా శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు యంత్రాంగం ఎందుకు వైఫల్యం చెందింది. విగ్రహం ధ్వంసమై గంటలు గడుస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ దుర్ఘటనకు పాల్పడిన వారితో పాటు.. వారి వెనుక ఉండి నడిపించిన సూత్రధారులను కూడా వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాల్సిన పూర్తి బాధ్యత పోలీసు అధికారులపైనే ఉంది. ఈ ఘటనపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, నిందితులను అరెస్ట్ చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని వైసిపి శ్రేణులు హెచ్చరిస్తున్నాయి.

## ఆ భూమిలోని నిర్మాణాలను పునరుద్ధరించండి

హైడ్రాకు హైకోర్టు ఆదేశం

హైడ్రాపై ఆగ్రహించిన హైకోర్టు


**కూకట్‌పల్లిలోని ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు ఊరట**

**సెక్యూరిటీ రూమ్, ఫెన్సింగ్, ప్రవేశద్వారం తిరిగి నిర్మించాలని ఆదేశం**

**24 గంటల్లో చర్యలు చేపట్టాలన్న హైకోర్టు**

హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలో ఉన్న ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన స్థలంలో హైడ్రా చర్యలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే స్థలానికి సంబంధించి వివిధ ఉత్తర్వులున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా రాత్రికి రాత్రి కూల్చివేతలు చేపట్టడాన్ని తప్పుబట్టింది. హైడ్రాకు ఇలాంటి చర్యలు కొత్త కాదని, కూల్చివేయడం, ఆ తర్వాత కంచె వేసి బోర్డు పెట్టడం, చర్యను సమర్థించుకోవడం, కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా తప్పించుకోవడానికి ప్రయత్నించడం హైడ్రాకు మామూలైపోయిందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పిటిషనర్లు సమర్పించిన ఫొటోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అర్థమవుతోందని, నిబంధనలకు వ్యతిరేకంగా హైడ్రా ప్రయోజనాలు పొందాలనుకుంటే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే అధికారం కోర్టుకు ఉందని పేర్కొంది. కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్ 1003 నుంచి 1006 వరకు ఉన్న 13.17 ఎకరాల భూమిలో ఈ నెల 25కు ముందు ఎలా ఉందో అలా పునరుద్ధరించాలంటూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కలెక్టర్?ను హైకోర్టు ఆదేశించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూమిలోకి వచ్చి ఫెన్సింగ్ కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్వీఎన్ కన్?స్ట్రక్షన్? హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. సెక్యూరిటీ గదులు, ప్రవేశ ద్వారాలను కూల్చివేయడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపేశారంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఇదే భూమి విషయంలో గతంలో హైకోర్టులో నమోదైన పిటిషన్ల విచారణలో భాగంగా కుంట, శిఖం భూమి అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖాధికారులు అఫిడవిట్ దాఖలు చేశారని వాదించారు. 2008లోనే రూ.9 కోట్లకు పైగా చెల్లించడంతో అప్పటి ప్రభుత్వం భూమిని తమకు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందన్నారు. హైడ్రా మాత్రం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలు చేపట్టిందని వాదించారు.

# డిప్రెషన్ అంటే కేవలం మానసిక ఆరోగ్య సమస్యనే కాదు, మెదడు పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది..



డిప్రెషన్ అనేది కేవలం మానసిక ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, అది మెదడు పనితీరుపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా డిప్రెషన్ ఎంతకాలం కొనసాగుతుందనే అంశం మెదడులో సంభవించే మార్పుల తీవ్రతను ప్రభావితం చేస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు భవిష్యత్తులో వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పరిశోధనలో మేజర్ డిప్రెషన్‌తో బాధపడుతున్న 46 మంది రోగుల మెదడు స్కాన్‌లను విశ్లేషించారు. పరిశోధన ఫలితాలు డిప్రెషన్ ఎపిసోడ్‌ల వ్యవధి, మెదడులోని వివిధ నాడీ నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానంలో ఉన్న మార్పుల మధ్య సంబంధం ఉందని సూచించాయి. ముఖ్యంగా రెండేళ్లకు పైగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో, ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన వారితో పోలిస్తే భిన్నమైన మెదడు కనెక్టివిటీ నమూనాలు కనిపించాయి.

**సమన్వయం దెబ్బ తినే అవకాశం..**

మెదడులోని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ నెట్‌వర్క్ (జజుచీ) నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించడం వంటి పనులకు బాధ్యత వహిస్తుంది. మరోవైపు డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (ఐవీచీ) అనేది ఆత్మపరిశీలన, వ్యక్తిగత ఆలోచనలు, జ్ఞాపకాలతో సంబంధం కలిగి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ రెండు నెట్‌వర్క్‌లు సమతుల్యంగా పనిచేస్తాయి. అయితే డిప్రెషన్ ఉన్నవారిలో ఈ సమన్వయం దెబ్బతినే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది. ఈ అసమతుల్యత కారణంగా వ్యక్తులు ప్రతికూల ఆలోచనల్లో చిక్కుకుపోవడం, పదేపదే అదే విషయాలను ఆలోచించడం, అవసరమైన సమయంలో పరిసరాలపై దృష్టి సారించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

**డిప్రెషన్‌తో నెగెటివ్ ప్రభావం..**

అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన రోగుల్లో లక్షణాలు తీవ్రమవుతున్న కొద్దీ జజుచీ, ఐవీచీ మధ్య అనుసంధానం తగ్గుతున్నట్లు గుర్తించారు. అయితే చాలా కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వారిలో డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ రెండు నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం మరింత బలపడుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ఫలితాలు డిప్రెషన్ కారణంగా మెదడులో జరిగే మార్పులు కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయని సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో కొన్ని నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం తగ్గిపోతుంది. అయితే వ్యాధి ఎక్కువకాలం కొనసాగినప్పుడు లేదా పదేపదే తిరిగి వచ్చినప్పుడు మెదడు పనితీరులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. డిప్రెషన్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఎంత ముఖ్యమో ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేసింది. మెదడులోని మార్పులను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ప్రతి వ్యక్తి పరిస్థితికి అనుగుణంగా మరింత సమర్థవంతమైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వేసవి కాలంలో రోజంతా బయట పనిచేసేవారు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి కాలం బయట పని చేసే కార్మికులకు ఒక పెద్ద సవాల్ లాంటిదని చెప్పవచ్చు. నిర్మాణ కార్మికులు, రోడ్డు పని చేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు వంటి వారు మండే ఎండలో గంటల తరబడి పనిచేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆహారం కేవలం ఆకలి తీర్చడానికే కాదు, శరీరానికి శక్తిని అందించడానికి, నీటి లోపాన్ని తగ్గించడానికి, అలసటను ఎదుర్కోవడానికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఎండలో పని చేసే కార్మికులు వేసవికాలంలో ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని అందించి తీవ్రమైన వేడిని తట్టుకునే శక్తిని ఇస్తాయి. వేసవిలో కార్మికులు భోజనంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆకలి తగ్గినప్పుడు కూడా పెరుగును సులభంగా తినగలుగుతారు. చాలామంది పెరుగును అన్నంతో కలిపి లేదా రోటీతోపాటు తీసుకుంటారు. ఇది శరీరానికి ఉపశమనం కలిగించడంతోపాటు తేలికైన పోషణను అందిస్తుంది.

**పెరుగు, మజ్జిగ, కూరగాయలు..**

పెరుగుతోపాటు మజ్జిగను కూడా కార్మికులు వేసవి ఆహారంలో ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి. రోజంతా చెమటలు పట్టే పనులు చేసే వారికి మజ్జిగ దాహాన్ని తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది. జీలకర్ర పొడి, ఉప్పు లేదా పుదీనాతో తయారు చేసే మజ్జిగ మరింత రుచికరంగా ఉండటంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్కువ సమయంలో తాగగలిగే ఈ పానీయం ఎండలో పనిచేసే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. అధిక మసాలాలు, నూనెతో చేసిన ఆహారం వేసవిలో భారంగా అనిపిస్తుంది. కనుక పెరుగన్నం, పప్పన్నం లేదా తేలికపాటి ఖిచిడీ వంటి ఆహారాలను ఎంచుకోవాలి. ఇవి కడుపుని నింపడంతోపాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అన్నం త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, దోసకాయ, నిమ్మకాయ, టమాటా వంటి ముడి కూరగాయలు కూడా వేసవిలో కార్మికుల భోజనంలో తరచూ కనిపిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. ముఖ్యంగా దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పుతో కలిసి తింటే భోజనానికి రుచి పెరగడంతోపాటు వేడి ప్రభావాన్ని కూడా కొంత మేర తగ్గిస్తుంది.



**కొబ్బరినీళ్లు, పండ్లు..**

అవకాశం ఉన్నప్పుడు కొబ్బరి నీరు, సీజనల్ పండ్లు కూడా కార్మికులు ఆహారంలో భాగంగా తీసుకోవాలి. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేయడంలో సహాయపడుతాయి. పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు అధిక నీటి శాతంతో ఉండటంతో వేసవిలో శరీరానికి చల్లదనం అందిస్తాయి. మామిడి పండ్లు కూడా శక్తినిస్తాయి కానీ ఎక్కువగా తీసుకుంటే భారంగా అనిపించే అవకాశం ఉంటుంది కనుక మితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది కార్మికులు ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లే రోటీలు, కూరలపై ఆధారపడతారు. కనుక సొరకాయ, బీరకాయ, గుమ్మడికాయ, ఆలుగడ్డ వంటి సీజనల్ కూరగాయలతో చేసిన సాధారణ కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి ఎక్కువసేపు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటాయి. తక్కువ నూనె, కొద్దిపాటి ఉప్పుతో తయారుచేసే ఈ భోజనం శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

**సత్తు పానీయం..**

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సత్తు వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఒకటి. నీటిలో సత్తు, నిమ్మరసం, ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది ఒకేసారి దాహాన్ని తీర్చడమే కాకుండా పొట్టని కూడా నింపుతుంది. అలాగే అటుకులు వంటి తేలికపాటి ధాన్యాలతో తయారుచేసిన ఆహారాలు కూడా సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి.వేసవిలో కార్మికులు ఈ సంప్రదాయ ఆహారాలు తీసుకోవడం ద్వారా కేవలం ఆకలి తీరడమే కాదు, మండే ఎండను ఎదుర్కొనే శక్తిని అందించే సహజ రక్షణ కవచాలుగా కూడా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే ఎన్నో లాభాలు.. రోజూ చేయాలంటున్న వైద్యులు..



భోజనం చేసిన వెంటనే కొద్దిసేపు నడవడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఫార్ట్ వాక్స్ పేరుతో వైరల్ అవుతోంది. అయితే ఇది కొత్త అలవాటు కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటని వివరిస్తున్నారు. ఈ చిన్న నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

**గ్యాస్ బయటకు వెళ్తుంది..**

భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. దీని వల్ల కడుపులో చిక్కుకుపోయిన గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ఈ అలవాటులో ప్రత్యేకమైన పరికరాలు, ఖరీదైన ఫిట్‌నెస్ సామగ్రి అవసరం లేదు. ఎవరైనా సులభంగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**ఎలా నడవాలి..**

ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ అలవాటును ప్రయత్నించవచ్చు.

# బదిలీల పంచాయితీ!

బదిలీల 'పంచాయితీ' ముదిరి పాకాన పడింది. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని కొందరు అధికారులు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నప్పటికీ, తాజా బదిలీల్లో అక్కడి నుంచి కదలకపోవడం విమర్శలకు తావిస్తున్నది. స్థానచలనం నుంచి తప్పించుకునేందుకు అడ్డదారులు సైతం తొక్కుతున్నట్లు తెలుస్తున్నది. ఇక మారుమూల జిల్లాల్లో పనిచేస్తూ.. బదిలీ కావాల్సిన తమకు అన్యాయం జరుగుతుందంటూ ఆ శాఖలోని ఇతర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేయడం కనిపిస్తున్నది. మంచిర్యాల జిల్లా పంచాయతీరాజ్‌శాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి ఒకరు బదిలీ నుంచి తప్పించుకునేందుకు తప్పుడు జాయినింగ్ రిపోర్టులు సమర్పించారన్న విమర్శలున్నాయి. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసిన ఆ ఉద్యోగి బదిలీపై మంచిర్యాలకు వచ్చి పదోన్నతి పొందారు. నిబంధనల మేరకు నాలుగేళ్లు పని చేయడంతో తప్పనిసరిగా సదరు అధికారి బదిలీ కావాలి. కానీ, బదిలీ నుంచి తప్పించుకునేందుకు మంచిర్యాలలో 3 రోజులు ఆలస్యంగా జాయిన్ అయినట్టు తప్పుడు రిపోర్టు సమర్పించి, సదరు అధికారి బదిలీ నుంచి తప్పించుకున్నారని ఆ శాఖలో పనిచేసే ఇతర ఉద్యోగులే చెబుతున్నారు. అప్పుడున్న డీపీవో రిపోర్టుకు, సదరు ఉద్యోగి సమర్పించిన జాయినింగ్ రిపోర్టుకు సంబంధమే లేదు. మంచిర్యాలలో జాయిన్ కావడానికి ముందు రెండు రోజులు ఆదిలాబాద్‌లో పని చేశానని, జీతం కోసమే 1వ తేదీన ఇక్కడ చేరినట్లు చూపించానని సదరు ఉద్యోగి చెబుతున్నా, ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు ఉద్యోగి జాయినింగ్ రిపోర్ట్ తప్పు చూపిస్తే, అడ్డుకోవాల్సిన ఆ శాఖ, జిల్లా ఉన్నతాధికారి ఎందుకు మౌనంగా ఉండిపోవడం, ఆ ఉద్యోగికి వెన్నుదన్నుగా నిలవడంపై పలువురు మండిపడుతున్నారు. ఇక పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి నాలుగు సంవత్సరాల సర్వీస్ ఆ జిల్లాలోనే పూర్తయింది. కానీ యూనియన్ ప్రతినిధిగా చెప్పుకొని ఆయన బదిలీ నుంచి మినహాయింపు పొందినట్టు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా బదిలీ కావాల్సిన అధికారులకు యూనియన్ నాయకత్వం ఇంతగా ఎందుకు సపోర్ట్ చేస్తున్నది, ఒకరి స్వార్థం కోసం యూనియన్‌లో మిగిలిన ఉద్యోగులకు అన్యాయం చేస్తారా అంటూ ఆ శాఖ ఉద్యోగులే పెదవి విరుస్తున్నారు.



**మారుమూల ప్రాంతాల్లో మగ్గాల్సిందేనా..**

బదిలీ కావాల్సిన అధికారులు ఇలా పాతుకుపోతుండడంతో అనేక సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో పనిచేస్తూ బదిలీ కోసం ఎదురు చూస్తున్న అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరుగుతున్నది. బదిలీతో కుటుంబాలకు దగ్గరగా వెళ్లాలన్న వారి ఆశలు నీరుగారి పోతున్నాయి. ఉదాహరణకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు ఆరేళ్లుగా పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్ తప్పనిసరి నిబంధన మేరకు బదిలీ కావాల్సి ఉంది. కానీ, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఆయన కేడర్ స్థాయి ఉద్యోగులు లేని కారణంగా ఆయనకు బదిలీ ఆప్షన్ లేకుండా పోయింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో నాలుగేండ్లకు పైగా పనిచేస్తున్న పలువురు ఉద్యోగులదీ ఇదే పరిస్థితి ఉన్నది. మే-31వ తేదీ దాటితే సర్కారు సాధారణ బదిలీలపై నిషేధం విధించనున్న నేపథ్యంలో.. 'మాకు అన్యాయం జరిగితే మళ్లీ సర్కారు బదిలీలకు అనుమతించే వరకూ ఎన్నేండ్లయినా మారుమూల ప్రాంతాల్లో, కుటుంబాలకు దూరంగా, అత్యవసర వైద్య సేవలకు దూరంగా మగ్గాల్సిందేనంటూ' పలువురు వాపోతున్నారు. పారదర్శకంగా బదిలీలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారంటూ బాధపడుతున్నారు. సాధారణ బదిలీల్లో ఉద్యోగులకు ఇంత అన్యాయం జరుగుతున్నా, ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కార్యదర్శుల బదిలీల్లో పైరవీల హవా**

మంచిర్యాల జిల్లాకు సంబంధించి పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లోనూ అధికారులు నిబంధనలకు పాతర వేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో మొత్తం 308 గ్రామ పంచాయతీలు ఉండగా, 300 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ జిల్లాలో 40శాతం మేర పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావాలి. ఈ మేరకు జిల్లాలో 97 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావాల్సి ఉండగా, ఇందులో దాదాపు 80 మంది దాకా పైరవీ లెటర్లు, ఎమ్మెల్యేల పీఏల రికమెండేషన్‌లతో పోస్టింగ్ కోసం వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో వచ్చిన వారికి బదిలీల్లో పెద్దపీట వేసినట్లు ప్రచారం జరుగుతున్నది. నిబంధనల ప్రకారం సీనియారిటీ, స్పౌజ్ కేసులు, రిటైర్మెంట్ దగ్గరలో ఉన్న వారికి బదిలీల్లో ప్రియార్టీ ఇవ్వాలి. కానీ పైరవీ బలంగా ఉన్నోళ్లకు సీనియారిటీ లిస్టుతో సంబంధం లేకుండానే పోస్టింగ్‌లిచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా ట్రాన్స్‌ఫర్లు చేశారని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పలు పత్రికల్లో కథనాలు వచ్చినా పరిస్థితి మారలేదని చెబుతున్నారు. ఈ నెలాఖరుతో ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని వెలుగులోకి తేవాలని పలువురు కోరుకుంటున్నారు. ఉన్నతాధికారులేమో పోస్టింగ్‌లకు తీవ్రమైన ఒత్తిడి ఉండటంతో తప్పడం లేదని విస్తుపోతున్నట్లు తెలిసింది. మందమర్రి మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి సంబంధించి ఓ నేత దాదాపు 10 మంది పంచాయతీ కార్యదర్శులకు రికమండేషన్ లెటర్లు ఇచ్చినట్లు సమాచారం. ఈ స్థాయి రికమెండేషన్లు వస్తుండటంతో ఏం చేయాలో తెలియక ఉన్నతాధికారులు చేతులెత్తేశారని వినికిడి. మొత్తానికి ఈ నెలాఖరుతో బదిలీల ప్రక్రియ ముగుస్తుందన్న సమయంలో పంచాయతీరాజ్ శాఖపై ఇలాంటి ఆరోపణలు రావడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# వేసవిలో వృథాగా పోతున్న మూసీ నీరు

**రెండు నెలలుగా కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల**
**పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు**
**ఆందోళనలో ఆయకట్టు రైతులు**

**కేతేపల్లి :** ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుపై సీమాంధ్ర పాలనలో ఉన్న మాదిరిగా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఓ వెలుగు వెలిగిన మూసీ ప్రాజెక్టు అభివృద్ధిలో మళ్లీ వెనుకబడుతోంది. నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడెం నియోజకవర్గాల పరిధిలోని రైతులకు జీవనాధారంగా ఉన్న మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల కాకుండా నిలిపేసి రెండు నెలలు గడుస్తోంది. అయినా ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా యథావిధిగా దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నది. కుడి కాల్వ తూము షెట్టర్ మరమ్మతులు చేపట్టాల్సి రావడంతో లీకేజీల ద్వా రా నీరు దిగువకు వెళ్తోంది. షెట్టర్‌ను పైకెత్తిన సందర్భంలో అది కిందకు దిగకుండా అలాగే ఉంటోందని అధికారులు అంటున్నారు. తాత్కాలికంగా షెట్టర్‌కు మరమ్మతులు చేపట్టినప్పటికీ వారం రోజుల్లోనే మళ్లీ లీకేజీలు ఏర్పడుతున్నాయి. నీటిని నిలిపి వేసిన ఏప్రిల్ నుంచి ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం తక్కువగా ఉన్న సమయంలో 30 నుంచి 50 క్యూసెక్కుల వరకు వృధాగా వెళ్లిన నీరు ప్రాజెక్టు నీటిమట్టం పెరిగినకొద్దీ వృథాగా పోతోంది. ప్రస్తుతం 200 క్యూసెక్కులకు పైగా నీరు కుడికాల్వ ద్వారా దిగువకు ప్రవహిస్తోంది. వృథాగా వెళ్తున్న నీటితో బీడు భూములు తడిసిపోతున్నాయి. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి నీటితో కళకళలాడుతున్నాయి. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోను నిల్వ చేసి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి వానాకాలం సాగుకు నీరందివ్వాలి. ఈ పరిస్థితిని అధికారులు పర్యవేక్షించడంలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు.



**కేసీఆర్ పాలనలో మారిన రూపురేఖలు**

మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో మూసీ ప్రాజెక్టు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. శిథిలావస్థకు చేరుకున్న ప్రాజెక్టుకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కేసీఆర్ సహకారంతో కోట్ల నిధులు మంజూరు చేయించి ఆయకట్టు ప్రాంత రైతులకు అండగా నిలబడ్డారు. ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీటిని అందించడమే ధ్యేయంగా గత ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. రూ. 19 కోట్లతో ప్రాజెక్టుకు నూతన గేట్లను ఏర్పాటు చేశారు. ఎర్త్‌డ్యాంపై బీటీ రోడ్డును సైతం నిర్మించారు. నూతన గేట్ల ఏర్పాటుతో ప్రాజెక్టు గేట్ల ద్వారా గాని, కాల్వల షెట్టర్ల ద్వారాగాని నీరు వృధాగా వెళ్లేది కాదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో ఏమాత్రం వర్షం కురిసినా వచ్చే ఇన్‌ఫ్లోను అంచనా వేస్తూ అధికారులు రిజర్వాయర్‌లో నీటి నిల్వను పెంచేవారు. నూతన రాష్ట్రం ఏర్పాటుకు ముందు కేవలం యాసంగిలో, అది కూడా ఆరుతడి పంటలకు మాత్రమే సాగునీటిని అందించేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన గేట్లు ఏర్పాటు చేసిన తర్వాత 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునేది. దాంతో నాటి నుంచి వానాకాలంలో కూడా రైతులకు సాగునీటిని అందించేవారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో, రిజర్వాయర్ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. బీఆర్‌ఎస్ పాలనలో చివరి ఆయకట్టు రైతులకు సైతం సాగునీరు అందేది.

**638.20 అడుగులుగా మూసీ నీటిమట్టం**

మూసీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 348.37 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం కుడి కాల్వకు 200 క్యూసెక్కుల వరకు అవుట్‌ఫ్లో వెళ్తున్నా ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్‌ఫ్లో వెళ్లడం లేదని అధికారులు చెప్పడం గమనార్హం. పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 638.20 అడుగులు(2.82 టీఎంసీలు) ఉన్నట్లు తెలిపారు.

# ఆస్తి తగాదాలు.. యువకుడిపై కత్తితో బంధువుల దాడి

వినాయక నగర్, మే 31 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత కొంతకాలంగా బంధువుల మధ్య కొనసాగుతున్న ఆస్తి తగాదాలు కత్తిపోట్లకు దారితీశాయి. తమ బంధువుల ఇంటికి వచ్చిన యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. నిజామాబాద్ నాలుగవ టౌన్ ఎస్‌హెచ్ ఓ సతీష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని అస్మీ కాలనీకి చెందిన సోహెల్ ఖాన్ అనే యువకుడు శనివారం రాత్రి బక్రీద్ సందర్భంగా నగరంలోని పులాంగ్ ప్రాంతంలో ఉండే తమ బంధువులైన షాహిద్ ఖాన్, సాజిద్ ఖాన్‌లను కలిసేందుకు వారి ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో అక్కడ ఉన్న జావిద్ ఖాన్ అతని కుమారులు ఫర్హాన్, జియాన్, వారి బామ్మర్ది అక్బర్‌లు కలిసి సోహెల్‌పై అకారణంగా దాడికి పాల్పడ్డాడు తెలిపారు. అక్బర్ అనే వ్యక్తి కత్తితో సోహెల్ తలపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై రక్తస్రావం అయిందని తెలిపారు. గాయాల పాలైన సోహెల్ కాను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రి తరలించారు. బాధితుడి ద్వారా నాలుగవ టౌన్ ఎస్సై సందీప్ వివరాలు సేకరించారు. అయితే సోహెల్



పై కత్తితో దాడి చేసిన అక్బర్ అనే వ్యక్తికి సాజిద్ ఖాన్‌కు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని వారు సోహెల్ ఖాన్‌పై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడి విషయమై బాధితుడి తండ్రి సలీం ఖాన్ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తామని ఫోర్త్ టౌన్ ఎస్‌హెచ్ ఓ సతీష్ వెల్లడించారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు
## మంత్రి పొన్నం ప్రభాకర్



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ విజయ రమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు. బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి
## గండ్ర యాదగిరి రావు



**రాజన్న సిరిసిల్ల :** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి సహకారం అందిస్తాం అని నవతేజ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చైర్మన్ గండ్ర యాదగిరి రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం చేశారని, ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. కోరుట్లపేట గ్రామశాఖ అధ్యక్షుడు లోకుర్తి బాలమల్లు, ఆలయ నిర్వాహకులు చిదుగు గోవర్ధన్ గౌడ్, సర్పంచ్ ఇల్లేందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పల్లకిలో స్వామి వారి
## ఉత్సవ మూర్తులకు వైభవంగా గిరి ప్రదక్షణ..!



**తంగళ్లపల్లి, మే 31:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు విశేష పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ , స్వామివారి ఉత్సవ మూర్తులకు పల్లకిలో గిరిప్రదక్షిణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూజారులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు ఉన్నారు.

## రాజీవ్ గాంధీ విగ్రహం తొలగింపు.. వీ హనుమంతరావు ఆందోళన

ఖమ్మంలో అధికారులు దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించారు. ఖమ్మం నగరంలోని కాల్వ ఒడ్డున గల మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అధికారులు తొలగించడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు నిరసన తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించడం దారుణమని, తొలగించిన విగ్రహాన్ని వెంటనే అదే స్థానంలో పునఃప్రతిష్ఠించాలని స్థానిక నేతలతో కలిసి వీహెచ్ హనుమంతరావు డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులు నేతృత్వం వహిస్తున్న ఖమ్మంలో రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించడం, ఆ విగ్రహాన్ని తొలగింపునకు వ్యతిరేకంగా సొంత పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆందోళన చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# బిజినెస్

## వాహన లీజింగ్‌లోకి ఇసుజు మోటర్స్!




వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇసుజు మోటర్స్ ఇండియా తమ డీ--మ్యాక్స్ ఎస్--క్యాబ్‌కి సంబంధించి దేశీయంగా లీజింగ్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో నాలుగేళ్ల ఫిక్స్‌డ్ కాలవ్యవధికి, నెలవారీ అద్దె రూ. 38,999 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. సంప్రదాయ ఫైనాన్స్ మోడల్‌తో పోలిస్తే కస్టమర్లకు రూ. 1.81 లక్షల మేర ఆదా అవుతుందని వివరించింది. ఫ్లీట్ ఆపరేటర్లతో పాటు వివిధ వ్యాపార వర్గాల కోసం ఈ సొల్యూషన్‌ని రూపొందించినట్లు కంపెనీ ఎండీ రాజేష్ మిట్టల్ తెలిపారు. ఇసుజు డీ-మ్యాక్స్ ఎస్-క్యాబ్ 2.5-లీటర్ ఎ+ు ఇంటర్‌కూల్డ్ డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ పొందుతుంది. ఇందులో పెద్ద కార్గో బెడ్‌తో పాటు హెవీ-డ్యూటీ సస్పెన్షన్ సెటప్ కూడా ఉంది, ఇది అధిక డిమాండ్ ఉన్న వాణిజ్య అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. క్యాబిన్ లోపల, డి-మాక్స్ ఎస్-క్యాబ్ ఆరు విధాలుగా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు, ఎయిర్ కండిషనింగ్, అనేక స్టోరేజ్ స్థలాలు, మల్టీ-ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వంటి ఆచరణాత్మక ఫీచర్లు ఉంటాయి.

## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!




డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హిండ్‌వేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. హిండ్‌వేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్. వినియోగదారులు గూగుల్‌లో ఌఊఅంఖ్ఘుతీవ అని వెతికినప్పుడు, హిండ్‌వేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హిండ్‌వేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే. గూగుల్ యొక్క ఘాంఔశీతీంం (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హిండ్‌వేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది.

**163 పేజీల తీర్పు**

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్లను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది. కోర్టు అభిప్రాయం ప్రకారం.. హిండ్‌వేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు. అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది. గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హిండ్‌వేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు చూపించడానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది.

# స్మార్ట్ గార్డెన్.. మట్టిలేకుండానే మినీ తోట!




మొక్కలకు నీళ్లు పోయడం నుంచి, పక్షులకు ఆహారం పెట్టడం వరకు... ఇప్పుడు ప్రకృతి పరిరక్షణ కూడా హైటెక్ అయిపోయింది! ఇంట్లోనే ఉంటూ తక్కువ కష్టంతో ఎక్కువ గ్రీనరీని ఎంజాయ్ చేయాలనుకునేవారి కోసం వచ్చేసిన సూపర్ నేచర్ గ్యాడ్జెట్స్ ఇవీ! రోబోటిక్ తోటమాలిఈ వేసవి ఎండల్లో మీరు మాత్రం హాయిగా రూమ్‌లోనో కూర్చుంటే, ఎవరైనా పైపు పట్టుకుని తోటలో నిలబడితే బాగుండు! అని అనుకుంటున్నారా! అందుకే మీ మొక్కలకు నీళ్లు పోసే బాధ్యతను మోయడానికి వచ్చేసింది ఈ సోలార్ స్మార్ట్ వైఫై స్ప్రింక్లర్ టైమర్! ఇది మీ గార్డెన్‌కు ఒక చిన్న డిజిటల్ తోటమాలి లాంటిది. దీనికి జీతం అక్కర్లేదు, కరెంట్ బిల్లుల తలనొప్పి లేదు, ఇందులోని సోలార్ ప్యానెల్‌తో ఎండలోనే ఆటోమేటిక్‌గా రీచార్జ్ అవుతుంది. పైగా మొబైల్ యాప్‌తో కనెక్ట్ చేసి ఎక్కడి నుంచైనా నీళ్లు ఎప్పుడు పట్టాలో కంట్రోల్ చేయొచ్చు. లేదంటే వాయిస్ కంట్రోల్‌తో సోఫాలో కూర్చునే 'అలెక్సా.. మొక్కలకు నీళ్లు పోయ్!' అని చెప్పేస్తే సరిపోతుంది. 'రెయిన్ డిలే' ఫీచర్‌తో 'వర్షం పడుతోంది కదా.. ఎందుకు మళ్లీ నీళ్లు!' అన్నట్టుగా ఆగిపోతుంది. ఐపీ65 వాటర్‌ప్రూఫ్ బాడీ, బలమైన బ్రాస్ ఇన్లెట్‌తో ఎండా వానలకు తట్టుకునే ఈ రోబోటిక్ తోటమాలి ధర రూ. 10,180 మాత్రమే!

**పక్షుల కోసం స్మార్ట్ హోటల్!**

ఉదయం కిటికీ దగ్గరకు వచ్చే పిచ్చుకలు, చిన్న చిన్న పక్షులను దగ్గరగా చూడాలని అనిపిస్తుందా? అయితే మీ ఇంటికే చిన్న బర్డ్ థియేటర్‌లా మారిపోయే ఈ సోలార్ ఏఐ బర్డ్ ఫీడర్ మీ కోసం! ఇది కేవలం గింజలు పెట్టే పాత్ర మాత్రమే కాదు, పక్షుల ప్రపంచాన్ని మీ కళ్ల ముందుకు తీసుకొచ్చే స్మార్ట్ గాడ్జెట్. దీనిలో ఉన్న కెమెరా పక్షులు వచ్చి గింజలు తింటున్న ప్రతి క్యూట్ మూమెంట్‌ను క్యాప్చర్ చేస్తుంది. పైగా ఇందులో ఉన్న ఏఐ టెక్నాలజీ ఏ పక్షి వచ్చిందో కూడా గుర్తించగలదు. సోలార్ పవర్‌తో పనిచేయడం వల్ల బ్యాటరీల తలనొప్పి ఉండదు. వర్షం, ఎండలకు తట్టుకునే వెదర్‌ప్రూఫ్ మెటల్ బాడీతో తయారైన ఈ స్మార్ట్ ఫీడర్ ధర రూ. 7,000 మాత్రమే!

**మట్టిలేకుండానే మినీ తోట!**

ఇంట్లోనే తాజా పుదీనా, తులసి లేదా చిన్న చిన్న కూరగాయలు పెంచుకోవాలని ఉందా? కానీ మట్టి, కుండీలు, రోజూ నీళ్లు పోసే టెన్షన్ వద్దనుకుంటున్నారా? అయితే ఈ హైడ్రోపోనిక్ గ్రోయింగ్ సిస్టమ్ మీ కోసం! ఇది మీ ఇంట్లోనే ఒక చిన్న స్మార్ట్ ఫార్మ్‌లా పనిచేస్తుంది. ఇందులో మొత్తం 12 ప్లాంటింగ్ స్టేషన్స్ ఉంటాయి. మట్టికి బదులుగా నీరు, పోషకాలు, ఎల్ఈడీ కాంతితో మొక్కలు వేగంగా పెరిగేలా చేస్తుంది. ఇందులో ఉన్న స్మార్ట్ ఎల్ఈడీ లైట్లు సూర్యరశ్మిలా పనిచేసి మొక్కలకు అవసరమైన కాంతిని ఇస్తాయి. 4.2 లీటర్ల పెద్ద వాటర్ ట్యాంక్, ఆటోమేటిక్ వాటర్ సర్క్యులేషన్ సిస్టమ్‌తో మొక్కలకు కావాల్సిన నీరు, ఆక్సిజన్ నిరంతరం అందుతాయి. లైట్ స్టాండ్ ఎత్తును కూడా మొక్కల పెరుగుదలకు తగ్గట్టు మార్చుకోవచ్చు. ధర రూ. 14,000 మాత్రమే!

# స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఢమాల్!

పెరిగిన ధరలతో 30 శాతం వరకు పడిపోయే అవకాశం

న్యూఢిల్లీ, మే 30: దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలకు ధరల పెంపు సెగ గట్టిగానే తాకనున్నది. రూపాయి పతనంతో మొబైల్ తయారీ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలు పెంచిన సంస్థలకు అమ్మకాల రూపంలో షాక్ తగలబోతున్నది. వచ్చే పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 30 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉన్నదని నివేదిక వెల్లడించింది. జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ధరలు మరోసారి పెరిగితే వార్షికంగా స్మార్ట్‌ఫోన్ సేల్స్ భారీగా పడిపోనున్నాయని ట్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల మంది యాక్టివ్ మొబైల్ కొనుగోలుదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 48 మంది వచ్చే ఆరు నెలల్లో ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేసుకుంటున్నట్టు చెప్పారు. కానీ, ఆరు శాతం మంది తమ వద్ద ఉన్న ఫోన్‌ను ఎక్స్చేంజ్ ఇచ్చి ఇతర స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు భవిష్యత్తులోనూ కొనసాగితే వచ్చే ఆరు నెలల్లో స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ 11-12 కోట్లకు పడిపోనున్నట్టు తెలిపింది. రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సరాసరిగా 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగాయి. ధరల పెరుగుదలే అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని టెకేర్ ఫౌండర్ ఫైజల్ కవూసా తెలిపారు. గడిచిన ఏడాదికాలంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం



విలువ ఐదు శాతం పడిపోయింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.

# ఐపీఎల్ ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఎక్కువగా వార్తల్లో నిలిచిన పేరు రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. బ్యాటింగ్ చేసినా, ఫీల్డింగ్ చేసినా, తిన్నా, పడుకున్నా.. ఇలా అతడు ఏం చేసినా అది వార్తగానే నిలిచేది. ఎలిమినేటర్‌లో ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తు చేసినప్పటికీ క్వాలిఫయర్-2 పోరులో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమి పాలయిన రాజస్తాన్ రాయల్స్ సీజన్‌ను మూడో స్థానంతో ముగించింది. జట్టు ఓటమి పాలైనప్పటికీ వైభవ్ మాత్రం సూపర్ సక్సెస్ అయ్యాడు. వైభవ్ సూర్యవంశీ ఆటను మరొక్కసారి చూస్తే బాగుంటుందని అభిమానులు ఆశపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ అభిమానులకు ఒక శుభవార్త. అతడి ఆటను చూడలేకపోవచ్చు కానీ అతడిని స్టేడియంలో మరోసారి చూసే అవకాశం మాత్రం దక్కనుంది. అహ్మదాబాద్ వేదికగా నేడు ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు వైభవ్ సూర్యవంశీ హాజరుకానున్నాడు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో వైభవ్ తళుక్కుమన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫైనల్ మ్యాచ్ చూసేందుకు వైభవ్ తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఫైనల్ మ్యాచ్ ముగిసిన అనంతరం వైభవ్ సూర్యవంశీని ప్రత్యేకంగా సన్మానించే అవకాశం కూడా ఉంది. ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఒకవేళ ఇవాల్టి ఫైనల్లో గిల్, సాయి సుదర్శన్ తక్కువ స్కోర్లకు




వెనుదిరిగితే మాత్రం వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకునే చాన్స్ ఉంది. ఈ సీజన్ ఆరంభం నుంచి స్థిరమైన ప్రదర్శన కొనసాగిస్తూ వచ్చిన వైభవ్ ఒక సెంచరీ సహా ఐదు అర్ధసెంచరీలు సాధించాడు. సీజన్‌లో 72 సిక్సర్లతో ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రికెటర్‌గా నిలిచాడు. ఇక గుజరాత్‌తో మ్యాచ్‌లో 47 బంతుల్లో 96 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. ఇక ఎలిమినేటర్ పోరులోనూ ఎస్ఆర్‌హెచ్‌పై సునామీ ఇన్నింగ్స్ ఆడిన వైభవ్ 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి ఔటయ్యాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ అతడి ఆటతో అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు.

## గర్వంగానే ఉంది.. నన్ను ఇరకాటంలో పెట్టొద్దు: అగార్కర్

టీమిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా అజిత్ అగార్కర్ వచ్చిన తర్వాత చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విషయంలో అతడి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి కఠిన నిర్ణయాలు తీసుకుందనేది బహిరంగ రహస్యమే. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్‌ను గెలిపించిన తర్వాత.. మరుసటి సిరీస్ నుంచే రోహిత్ శర్మ (=శీష్ట్రఊ ాష్ట్రుతీఝ)ను కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఇక సంజూ శాంసన్‌ను కాదని.. టెస్టు, వన్డే జట్ల సారథి శుబ్‌మన్ గిల్‌ను టీ20 ఓపెనర్‌గా దించి నాయకత్వ బృందం భారీ మూల్యమే చెల్లించింది.

**గిల్‌పై వేటు వేసి..**

అయితే, పొరపాటును గ్రహించిన అగార్కర్ బృందం.. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీకి ముందు సంచలన నిర్ణయం తీసుకుంది. గిల్‌పై వేటు వేసి.. ఇషాన్ కిషన్‌ను ప్రపంచకప్ జట్టులో కొనసాగించింది. ఇక స్వదేశంలో జరిగిన ఈ మెగా ఈవెంట్లో భారత్ ట్రోఫీ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో నాకౌట్ మ్యాచ్‌లలో గొప్పగా రాణించిన ఓపెనర్ సంజూ శాంసన్ (97ని, 89, 89) ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు అందుకున్నాడు. ఏదేమైనా.. ఏ సిరీస్‌కు భారత జట్టును ప్రకటించినా అగార్కర్‌పై విమర్శలు రావడం సహజమే. ఈ




విషయం గురించి అతడు తాజాగా స్పందించాడు. ముంబైలో శనివారం జరిగిన క్రిక్‌ఇన్ఫో అవార్డు ప్రదానోత్సవానికి అగార్కర్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా ప్రజెంటర్ డానిష్ సైట్ (ఆర్సీబీ మిస్టర్ నాగ్స్‌గా పాపులర్) అతడిని తన ప్రశ్నలతో ఇరుకున పెట్టాడు. 'అబ్బ.. ఎంత గొప్ప జట్టును ఎంపిక చేశానో' అని మీరు మురిసిపోయిన సందర్భాలు ఉన్నాయా? నేను చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సి ఉంటుంది. లేదంటే నా మాటల్ని ఇష్టమొచ్చినట్లుగా వక్రీకరిస్తారు!.. ఏదేమైనా జట్టు గెలిచిన సందర్భంలో.. ఆ క్షణంలో నాకు గర్వంగానే ఉంటుంది. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా మంచి జట్టును ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉంటుంది. మన దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉన్నారు. క్రికెట్ అభిమానుల దృష్టి మీపైనే ఉంటుంది. మరి ఓ ఆటగాడికి అవకాశం ఇవ్వలేనప్పుడు.. 'సారీ మ్యాన్.. ఈసారి కాదు గానీ.. మళ్లీ వచ్చే సిరీస్‌కు చూద్దాంలే' అని మీరు అతడికి చెప్పగలరా? ఇందుకు మీరు ఎలాంటి మార్గం

# స్పోర్ట్స్

## ఆస్ట్రేలియాను చిత్తు చేసిన పాకిస్తాన్




ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్తాన్ శుభారంభం చేసింది. శనివారం రావాల్పిండి వేదికగా జరిగిన తొలి వన్డేలో ఆసీస్‌ను 5 వికెట్ల తేడాతో పాక్ చిత్తు చేసింది. తమ 1,000 వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. పాక్ బౌలర్ల ధాటికి 44.1 ఓవర్లలో 200 పరుగులకే కుప్పకూలింది. అరంగేట్ర ఆటగాడు అరాఫత్ మిన్హాస్ 5 వికెట్లు పడగొట్టి కంగారుల పతనాన్ని శాసించాడు. జోష్ ఇంగ్లిష్, గ్రీన్, లబుషేన్ వంటి కీలక వికెట్లను అరాఫత్ తన ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా వన్డే అరంగేట్రంలో 5 వికెట్లు పడగొట్టిన తొలి పాక్ బౌలర్‌గా మిన్హాస్ నిలిచాడు. ఇక ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా(61), మాథ్యూ షార్ట్(55) మినహా మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో మిన్హాస్‌తో పాటు అబ్రార్ రెండు, రౌఫ్, అఫ్రిది, అఘా తలా వికెట్ సాధించారు.

**బాబర్, ఘోరి హాఫ్ సెంచరీలు**

అనంతరం పాకిస్తాన్ 32 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. అయితే స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం (69), వికెట్ కీపర్ బ్యాటర్ ఘాజీ ఘోరి (65) మూడో వికెట్‌కు 127 పరుగుల అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనప్పటికి మిన్హాస్(18), సమద్(1) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ఫినిష్ చేశారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఈల్లీస్ రెండు, మాథ్యూ కునెమన్, తన్వీర్ సంగా, లబుషేన్ తలా వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే జూన్ 2న లహోర్ వేదికగా జరగనుంది.



# ‘రాకా’ నుంచి గ్లింప్స్ రాబోతుందా?

## అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!

‘పుష్ప’ ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా ‘రాకా’ పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘రాకా’ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా ‘రాకా’ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే ‘రాకా’ ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వెండితెరపై ఎంట్రీ ఇస్తున్న ‘రాను బొంబాయికి రాను’ భామ!



‘రాను బొంబాయికి రాను’ ఫోక్ సాంగ్ ఎంత సూపర్ హిట్ అయిందో అందరికి తెలిసిందే. లిరిక్స్ కంటే ఎక్కువగా రామ్ రాథోడ్, లిఖిత వేసిన స్టెప్పులు బాగా వైరల్ అయ్యాయి. అంతేకాదు ఈ ఒక్క పాటతో లిఖిత..తెలుగు ఆడియన్స్‌కి బాగా దగ్గరైంది. ఈ పాట తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. అయితే ఇన్నాళ్లు ప్రైవేట్ ఆల్బమ్స్‌తో అలరించిన లిఖిత..ఇక ఇప్పుడు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఆమెను టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాడు. సామ్రాట్, డీమోన్ పవన్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి ‘సాం3’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ రోజు పూజా కార్యక్రమాలతో ‘సాం3’ సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ – డైరెక్టర్ గారు ఈ స్క్రిప్ట్ చెబుతున్నప్పుడే మూవీ ఎలా ఉంటుంది అనేది క్లియర్ గా తెలిసింది. నేను ఫోక్ సాంగ్స్ నుంచి చిన్న గ్యాప్ తీసుకున్నాను. హీరోయిన్ గా మంచి రోల్స్ చేయాలనే ఫోక్ సాంగ్స్ కు గ్యాప్ ఇచ్చాను. అయినా మంచి ఆల్బమ్ వస్తే తప్పకుండా చేస్తాను. నేను ఒక బెస్ట్ స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్న టైమ్ లో ఈ మూవీ ఆఫర్ వచ్చింది. సామ్రాట్, పవన్ లాంటి కోస్టార్స్ దొరకడం హ్యాపీగా ఉంది. ఎలాంటి స్క్రిప్ట్ పేపర్ లేకుండా మేమంతా కథను ఓన్ చేసుకుని నటించాం. అదంతా మా డైరెక్టర్ వల్లే సాధ్యమైంది’ అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ... లిఖి, డీమోన్ పవన్ కొత్త వాళ్లు ఎలా నటిస్తారో అనుకున్నాను గానీ పర్ ఫార్మెన్స్ ఇరగదీశారు. మా టెక్నీషియన్స్ అందరూ అద్భుతమైన ఔట్ పుట్ ఇచ్చారు. ‘సాం3’ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం’ అన్నారు. హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – బిగ్ బాస్ తర్వాత నేను ఎలాంటి మూవీ చేయాలని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ కృష్ణ మాయ ఈ స్క్రిప్ట్ చెప్పారు. చాలా మంచి స్క్రిప్ట్ ఇది. ఆయన స్క్రిప్ట్ చెబుతుంటే ఇంకా వినాలని అనిపించింది. అంత ఎక్స్ ప్రెసివ్ గా స్టోరీ చెప్పారు. ఇలాంటి దర్శకుడితో వర్క్ చేస్తే నటుడిగా నాకు మంచి పేరొస్తుందని నమ్మాను. మేమంతా ఈ సినిమా కోసం ఎలాంటి డైలాగ్స్ లేకుండా ఆన్ సెట్ ఇంప్రూవైజ్ చేసుకుంటూ నాచురల్ గా నటించాం. తక్కువ టైమ్ లో మేమంతా క్వాలిటీగా సినిమా చేశాం. అన్నారు.



# శింబు టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమా?.. తెలుగు డెబ్యూపై మళ్లీ జోరందుకున్న చర్చ

కోలీవుడ్ స్టార్ హీరో శింబుకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులో డబ్బింగ్ అయి మంచి విజయాలు సాధించడంతో టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఇంతటి క్రేజ్ ఉన్నప్పటికీ శింబు ఇప్పటివరకు నేరుగా తెలుగు సినిమాలో నటించలేదు. దీంతో ఆయన టాలీవుడ్ ఎంట్రీ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలలుగా శింబు ఓ ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థతో సినిమా చేయబోతున్నారనే ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. మనసనమహా’ షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు దీపక్ రెడ్డి చెప్పిన కథ నిర్మాతలను ఆకట్టుకుందని, శింబు కూడా ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆ తర్వాత ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పుడు తాజాగా మరో కొత్త కథతో శింబు ముందుకు వచ్చినట్లు సమాచారం. యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ ఆయనను బాగా ఆకట్టుకుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన ‘డ్యూడ్’ చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తిశ్వరన్, కొత్త తరహా కథాంశంతో శింబును మెప్పించినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక శింబు కెరీర్ విషయానికి వస్తే, బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన ఆయన 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ప్రేమకథలు, యాక్షన్ డ్రామాలు, మాస్ ఎంటర్‌టైనర్‌లతో తమిళ ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగారు. ఒక దశలో తెలుగులో కూడా ఆయన సినిమాలకు మంచి మార్కెట్ ఏర్పడింది. అయితే వరుస పరాజయాలు, వ్యక్తిగత వివాదాల కారణంగా కొంతకాలం కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తిరిగి వరుస విజయాలతో బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన శింబు, ప్రస్తుతం తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు మార్కెట్‌పై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు తమిళ హీరోలు నేరుగా తెలుగు సినిమాలు చేసి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో శింబు కూడా అదే బాటలో నడవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



# ఏడేళ్ల ప్రేమకు పెళ్లి ముహూర్తం..

## ప్రియాంక జైన్‌తో వివాహంపై క్లారిటీ ఇచ్చిన శివకుమార్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. ‘మౌనరాగం’ సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది.వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. “పెళ్లి ఎప్పుడు?” అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రేమ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాది ఏడేళ్ల ప్రేమ. మొదట ప్రియాంకే నాకు ప్రపోజ్ చేసింది. ఆమె ప్రపోజ్ చేసిన రెండు రోజుల తర్వాత నేను ఓకే చెప్పాను. అప్పటి నుంచి మా బంధం మరింత బలపడింది అని తెలిపారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌పై కూడా ఆయన స్పందించారు. మేము కలిసి ఉండటానికి ముందే మా కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నాం. రెండు కుటుంబాలు కూడా మా నిర్ణయాన్ని గౌరవించాయి. వారి అంగీకారంతోనే మేము లివ్-ఇన్‌లో ఉన్నాం అని చెప్పారు. పెళ్లి విషయానికి వస్తే, ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఒక ఇంటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మా కలల ఇల్లు నిర్మాణంలో ఉంది. అది పూర్తయిన వెంటనే ఈ ఏడాదిలోనే పెళ్లి చేసుకుంటాం. పెళ్లి కోసం ఇప్పటికే కొన్ని ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాం అని అన్నారు. తమ వివాహాన్ని ఉత్తరాఖండ్‌లోని ఓ పవిత్ర ఆలయంలో నిర్వహించాలని భావిస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. యోగి నారాయణ్ ఆలయంలో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. పురాణాల ప్రకారం శివపార్వతుల వివాహం కూడా అక్కడే జరిగినట్లు చెబుతారు. అందుకే ఆ ప్రదేశం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది అని వివరించారు.ఆలయంలో సాంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన అనంతరం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే భవిష్యత్తులో నిర్మిస్తున్న ఇంట్లో రెండు కుటుంబాలు కలిసి ఉండేలా ప్రణాళికలు వేసుకున్నామని వెల్లడించారు. నేను నా కుటుంబంతో, ప్రియాంక తన కుటుంబంతో కాకుండా అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలని కోరుకుంటున్నాం. కుటుంబ బంధాలకు మేము ఎంతో విలువ ఇస్తాం అని శివకుమార్ తెలిపారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,